APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 40 | ఎడిటర్ : ఎం. రమేష్ | శుక్రవారం, ఆగస్టు 30, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-



## అమరావతి అంటే..
# దేవతల రాజధాని

**అమరావతి,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**

ఏపీ రాజధాని అమరావతిని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీగా తీర్చిదిద్దాలని.. ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. రాజధాని అమరావతిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ అధికారులతో ఆయన గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ గుర్తుకు వచ్చేలా అమరావతి లోగో ఉండాలని.. రాజధాని పేరులో ఆంగ్లంలో మొదటి అక్షరం చివరి అక్షరం కలిసేలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీ లోగో రూపొందించాలని సూచించారు. 'అమరావతి దేవతల రాజధాని. అలాంటి గొప్ప రాజధాని పట్ల గత ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది. ఇప్పుడు రాజధాని పనులు వేగవంతం కావాలి. పనుల విషయంలో ఎక్కడా రాజీ వద్దు.' అని సీఎం అధికారులకు సూచించారు. 90 రోజుల్లో సీఆర్డీఏ కార్యాలయ నిర్మాణం పూర్తి కావాలని నిర్దేశించారు. రాజధాని ప్రాంతంలో త్వరితగతిన జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తి చేయాలని అన్నారు. రాజధానిలో ఎటు చూసినా సాంకేతిక సౌలభ్యత ఉట్టిపడాలన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని.. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించాలని సూచించారు. రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తి చేయడానికి పట్టే సమయం, పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవడం వంటి అంశాలపైనా సమావేశంలో

- మిగతా 2లో..

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సిటీగా అమరావతి

అందుకు అనుగుణంగా రాజధాని లోగో రూపకల్పన

ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలి

రాజధాని పనుల్లో వేగం పెంచాలి

ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం



## భూ కుంభకోణాలపై సిసోడియా నివేదిక

వచ్చే కేబినేట్‌లో చర్చించి చర్యలు

ఆర్టిఫియల్ ఇంటిలిజెన్స్ కేంద్రంగా విశాఖ

విద్యాశాఖలో సంస్కరణలపై మేధావుల సూచనలు

విశాకలో మంత్రి లోకేశ్ వెల్లడి

వివరాలు 2లో

## ఓటుకునోటు కేసు బదిలీని కొట్టేసిన సుప్రీం

**న్యూఢిల్లీ,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**

ఓటు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలన్న బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. కేసు విచారణ తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్ కు బదిలీ చేయాలని కోరుతూ చాలా రోజు క్రితం జగదీష్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ బీఆర్ గవై నేతృత్వంలోని ధర్మాసనం ఆయన అభ్యర్ధనను తిరస్కరించింది. జగదీశ్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు.

# తండ్రి కెసిఆర్‌ను కలిసిన కవిత

**గుండెలకు హత్తుకున్న కెసిఆర్**
**ఇద్దరిలోనూ భావోద్వేగ క్షణాలు**

**గజ్వేల్,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బెయిల్ వచ్చిన తరువాత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ని గురువారం కలిశారు. హైదరాబాద్ నుంచి ఉదయాన్నే బయల్దేరిన ఆమెఎర్రవల్లిలో ఉన్న ఫాంహౌజ్‌కి చేరుకున్నారు. ఆమె వెంట భర్త అనిల్, కుమారుడు కూడా ఉన్నారు. ఆమెకు కేసీఆర్ కుటుంబ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. కవితకు బెయిల్ రావడంపై కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్.. కవితను చూసిన వెంటనే ఆమెను గుండెలకు హత్తుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం ఆమె కేసీఆర్ పాదాలకు నమస్కరించారు. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపాలవ్వడం, మరోవైపు కవిత అరెస్ట్, ఇంకోవైపు లోక్ సభ ఎన్నికల్లో సున్నా సీట్లకు పరిమితం కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు నిరాశలో మునిగిపోయాయి. అయితే చాన్నాళ్ల తరువాత కేసీఆర్ ముఖంలో ఇవాళ ఉత్సాహం, సంతోషం కనిపించిందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. కవితను అక్రమంగా నిర్బంధించారని చివరికి సత్యమే గెలిచిందని చెబుతున్నారు. కవిత రాకతో ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు ఉన్నారు. అయితే జీవన్ రెడ్డి కవిత కాళ్లకు నమస్కారం చేయడం విమర్శలకు దారితీస్తుంది. కవిత ఇంట్లోకి ప్రవేశించే ముందు అక్కడే ఉన్న జీవన్ రెడ్డి ఆమెకు పాదాభివందనం చేశారు.





## అక్రమ కేసులు బనాయించి వేధించిన వారిపై చర్యలు

ఎంతటి వారు ఉన్నా విడిచిపెట్టే ప్రసక్తి లేదు

సినీ నటి కాదంబరి జత్వాని కేసుపై హోంమంత్రి స్పందన

వివరాలు 2లో

# ఇండస్ట్రియల్ పార్కులలో సమస్యల పరిష్కారానికి చర్యలు

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్**
**ఓర్వకల్లు, కొప్పర్తి, చిత్తూరు, తిరుపతి, విజయవాడ, గుంటూరు, పుట్టపర్తి, అనంతపురం పారిశ్రామిక పార్కులపై రివ్యూ**

**మంగళగిరి, ఆగష్టు 29 (పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ పార్కులలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో తిరుపతి, చిత్తూరు, విజయవాడ, గుంటూరు, కర్నూలు, కడప, పుట్టపర్తి, అనంతపురం ఇండస్ట్రియల్ పార్కుల జీ.యంలు, జెడ్.యంలతో మంత్రి టి.జి భరత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓర్వకల్లు, కొప్పర్తితో పాటు ఇతర ఇండస్ట్రియల్ పార్కుల స్థలాలపై ఆరా తీశారు. ఏ పార్కులో ఎంత ల్యాండ్ ఉందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇండస్ట్రియల్ పార్కు స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూసుకోవాలన్నారు. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. దీంతోపాటు ఏపీఐఐసీ భూముల కోర్టు కేసులపై మంత్రి వివరాలు అడిగారు. పార్కుల వద్ద ఆర్చ్ ఏర్పాటుచేసి ఎంత విస్తీర్ణం ఉందో వివరాలతో పాటు, మ్యాప్ పెట్టాలని సూచించారు. ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తేనే పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఏపీకి వస్తున్నారన్నారు.





తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# అక్రమ కేసులు బనాయించి వేధించిన వారిపై చర్యలు

**ఎంతటి వారు ఉన్నా విడిచిపెట్టే ప్రసక్తి లేదు**
**సినీ నటి కాదంబరి జత్వాని కేసుపై హోంమంత్రి స్పందన**

**అమరావతి,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్) :**

అక్రమంగా కేసులు బనాయించి వేధించిన వారిపై చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి అనిత హెచ్చరించారు. ముంబయి సినీ నటి కాదంబరి జత్వాని కేసుపై ఆమె స్పందించారు. నటి కాదంబరి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసుపై విచారణ జరుగుతుందన్నారు. దర్యాప్తు కోసం ఓ మహిళా అధికారిని నియమించామని హోంమంత్రి అనిత తెలిపారు. ఓ అమ్మాయికి జరిగిన అన్యాయానికి న్యాయం చేస్తామన్నారు. కేసులో ఎంతటి వారున్నా చట్టపరంగా శిక్షిస్తామన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని హోంమంత్రి పేర్కొన్నారు. పోలీసులు ప్రభుత్వానికి, ప్రజలకు జవాబుదారీ తనంగా ఉండాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేసి సొంత పనులకు ఉపయోగించుకున్నారని తెలిపారు. ఎక్సైజ్ విభాగాన్ని పూర్తిగా గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. దిశా పోలీస్ స్టేషన్లు ను మహిళా పోలీస్ స్టేషన్లుగా మార్చామని హోంమంత్రి పేర్కొన్నారు. సర్యూట్ హౌస్ లో వినాయక చవతి ఉత్సవాల అనుమతిపై సింగల్ విండో పోర్టల్‌ను హోంమంత్రి అనిత ప్రారంభించారు. వినాయకచతి ఉత్సవాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. మొబైల్ ఫోన్ ద్వారా ఉత్సవాలకు అనుమతులు పొందవచ్చని తెలిపారు. రేపటి నుంచి యాప్ అందుబాటులోకి వస్తుందన్నారు. యాప్ లో ఉత్సవాలకు సంబంధించిన వివరాలు నమోదు చేస్తే అన్ని విభాగాల అధికారులు పరిశీలించి అనుమతులు ఇస్తారని చెప్పారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటారని, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. వినాయక చవితి ఉత్సవాల్లో భద్రత విషయంలో రాజీపడే సమస్య లేదని స్పష్టం చేశారు. ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా ఉత్సవాలు చేసుకోవాలని హోంమంత్రి సూచించారు. ముంబయి నటి కాదంబరి జత్వానిపై పెట్టిన అక్రమ కేసును రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది నర్రా శ్రీనివాస్ ఈ పిటిషన్ వేశారు. జత్వాని కేసులో పోలీసులు, వైసీపీ నేతలు కుట్రపూరితంగా వ్యవహరించారని ఈ సందర్భంగా లాయర్ పేర్కొన్నారు. ఒక్కరోజులోనే విచారణ, సాక్ష్యాల సేకరణ ఎలా సాధ్యమన్నారు. ఫోర్జరీ కేసులో సంబంధం లేకపోయినా జత్వాని తల్లిదండ్రులను అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఈ కేసులో పోలీసు ఉన్నతాధికారుల పాత్రపై లోతుగా విచారణ జరపాలని ఆయన కోరారు.

# నేతన్నకు చేయూత పథకానికి 90కోట్లు విడుదల

**హైదరాబాద్,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**

చేనేత కార్మికులలో పొదుపు భద్రతా భావాన్ని పెంపొందించుటకు ప్రవేశపెట్టిన నేతన్నకు చేయూత పథకానికి సంబంధించి గత ప్రభుత్వం బకాయి పెట్టిన నిధులతో పాటు ఎలాంటి బకాయిలు లేకుండా ముఖ్యమంత్రి చొరవతో ఏకమొత్తంగా రూ.90 కోట్లను నేతన్నకు చేయూత కింద విడుదల చేయడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంత్రి గురువారం నాడు ఒక ప్రకటనలో నేతన్నల చేయూత నిధుల వివరాలను వెల్లడించారు. ఈ పథకం సెప్టెంబర్ 2021 నాడు మొదలై ఆగస్టు 2024 న ముగియనుందని, ఈ నిధుల విడుదల ద్వారా 36,133 మంది చేనేత కార్మికులు లబ్దిపొందుతారని తెలిపారు. ఈ పథకంలో చేనేత కార్మికులు ,అనుబంధ కార్మికులు తమ నెలసరి వేతనంలో 8 శాతం వాటా జమచేసిన్లట్లైతే ప్రభుత్వం తమ వాటాగా 16 శాతంను పొదుపుఖాతాలో జమచేయడం జరుగుతుందని, ఈ మొత్తాలను వడ్డీతో సహా 3 సంవత్సరాల గడువు కాలం పూర్తికాగానే లబ్దిదారులకు చెల్లించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. దీనివలన ఒక్కొక్క చేనేత కార్మికుల 3 సంవత్సరాల గడువు కాలం పూర్తికాగానే వడ్డీతో సహా సుమారుగా రూ. 60,000 నుండి 1,29,000 వరకు లబ్దిపొందనున్నారని మంత్రి తెలపారు. గత ప్రభుత్వం నేతన్నలను పట్టించుకోకుండా బకాయిపెట్టి వారి నోట మట్టికొట్టిందని, కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకం ముగిసే సమయానికి ముందే గత ప్రభుత్వం పెట్టిన బకాయిలతో పాటు ఎలాంటి బకాయిలు లేకుండా నేతన్నలకు సామాజిక భద్రత కలిగించాలనే ఉద్దేశ్యంతో నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడు కట్టుబడి ఉందని చెప్పడానికి ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే అని మంత్రి పేర్కొన్నారు. చేనేత కార్మికులు పడే కష్టానికి ఎలాంటి నష్టం కలగకుండా వారికి సరైన ప్రతిఫలం అందేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఈ రంగంలో మరింత అభివృద్ధి సాధించి, తద్వారా చేనేత కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే తమ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## రాహుల్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు

**కంగనాపై అంబర్‌పేట స్టేషన్‌లో వీహెచ్ ఫిర్యాదు**

హైదరాబాద్,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్): కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీపై ఎంపీ, బీజేపీ నేత కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన కంగనాపై అంబర్‌పేట పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. రాహుల్ చెత్తగా మాట్లాడతారని, డ్రగ్స్ తీసుకుంటారని కంగనా ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను ఖండించిన వీహెచ్... పాపులారిటీ కావడం కోసమే కంగనా ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. ఆమె ఏదున్నా పార్లమెంట్‌లో మాట్లాడాలని సూచించారు. రాహుల్‌కి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని.. రాహుల్‌తోపాటు బడుగు, బలహీన వర్గాల ప్రజలందరినీ ఆమె అవమానించిందని మండిపడ్డారు. హైదరాబాద్ మహానగరంలో చెరువులు ఇతర జలవనరుల పరిరక్షణే ధ్యేయంగా రేవంత్ సర్కార్ తీసుకువచ్చిన హైడ్రా వ్యవస్థ భేష్ అని వీహెచ్ పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ చక్కగా పని చేస్తున్నారని కితబిచ్చారు. అయితే ప్రభుత్వం పేదల ఇళ్లు కూల్చాల్సి వస్తే.. వారికి వేరే చోట డబల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. సీఎం రేవంత్ తన కుటుంబ సభ్యుల అక్రమాలు ఉన్నాయని తేలినా.. కూల్చేయాలని చెప్పడం మంచి విషయమని వీహెచ్ అన్నారు.

# అమరావతి అంటే దేవతల రాజధాని

మొదటి పేజీ తరువాయి

ఆయన సమీక్షించారు. అటు, హ్యాపీ నెస్ట్ ప్రాజెక్టుపైనా సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాజధాని ప్రాంతంలో నివాసం ఉండాలని కోరుకునే వారి కోసం 14 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును రూపొందించామని.. అయితే, 2019లో వైసీపీ హయాంలో దీనికి గ్రహణం పట్టిందన్నారు. ఈ ఫ్లాట్లన్నీ అప్పట్లో ఒక్క గంటలోనే అమ్ముడు పోయాయని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఈ ప్రాజెక్టును అప్పటి ప్రభుత్వ చర్యలతో కొనుగోలుదారులు వెనక్కి వెళ్లిపోయారని అన్నారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా వచ్చిన నష్టాన్ని పూడ్చేలా విధానాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనుల కోసం 190 ప్రొక్లెయిన్లు వినియోగిస్తు న్నామని.. 60 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరోవైపు, విశాఖ, విజయవాడల్లో మెట్రో రైలు ప్రాజెక్టు పనులను సైతం త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును రెండు ఫేజుల్లో చేపడతామని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి సీఎంకు వివరించారు. అటు, విజయవాడలోనూ రూ.11 వేల కోట్లతో 38 కి.మీ మేర చేపట్టబోయే మెట్రో రైలు నిర్మాణ ప్రాజెక్ట్ పనులను సైతం వేగవంతం చేయాలని సీఎం నిర్దేశిరచారు. సెప్టెంబర్ 15లోగా అమరావతి రైతులకు వార్షిక కౌలు చెల్లిస్తామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిపై సీఎం సమీక్ష అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. అమరావతిలో ఇంకా 3,550 ఎకరాలు సేకరించాల్సి ఉందని అన్నారు. 'హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సీఎం క్లియరెన్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.900 కోట్లు కావాలి. విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టుల పూర్తికి సీఎం ఆదేశాలిచ్చారు. ట్రాఫిక్ సమస్యలు తగ్గాలంటే మెట్రోల వల్లే సాధ్యం.' అని మంత్రి పేర్కొన్నారు.



## భూ కుంభకోణాలపై సిసోడియా నివేదిక

**వచ్చే కేబినేట్‌లో చర్చించి చర్యలు**
**ఆర్టిఫియల్ ఇంటిలిజెన్స్ కేంద్రంగా విశాఖ**
**విద్యాశాఖలో సంస్కరణలపై మేధావుల సూచనలు**
**విశాకలో మంత్రి లోకేశ్ వెల్లడి**

**విశాఖపట్టణం,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**

రాష్ట్రంలో జరిగిన భూ కుంభకోణాలపై సిసోడియా నివేదికపై వచ్చే కేబినెట్‌లో చర్చించి లెక్కలన్నీ బయటపెడతామని, అక్రమాలకు బాధ్యులైన అందరి పైనా చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేష్ తెలిపారు. వైసీపీ పాలనలో విశాఖలో రాజారెడ్డి రాజ్యంగా అమలైందని ఆయన ఆరోపించారు. బెదిరించి భూముల దోపిడీ చేశారని.. ఆ క్రమంలో నేరాలు జరిగాయన్నారు.విశాఖ పట్టణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు కేంద్రంగా మారుస్తామని మంత్రి పేర్కొన్నారు. ఆ దిశగా పెట్టుబడిదారులతో చర్చిస్తున్నామన్నారు. ఎన్డీఏకు ప్రజాక్షేత్రంలో మంచి తీర్పు వచ్చింది. ఇక కోర్టులో తీర్పు పెండింగ్‌లో ఉందన్నారు. ఓ పత్రిక తనపై తప్పుడు కథనాలు ప్రచురించిందని.. తప్పు చేసినట్టు ఆ పత్రిక ఒప్పుకోలేదని.. అందుకే 75కోట్లకు పరువు నష్టం దావా వేశానన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో పాత విధానం అమలు చేస్తామని.. సెప్టెంబర్ 11న ముఖ్యమంత్రి సమక్షంలో ఫేజ్ రీయింబర్స్‌మెంట్ అమలు మీద నిర్ణయం తీసుకుంటామన్నారు. అధికారం టీడీపీకి కొత్త కాదని.. తాను ఎప్పుడూ మంత్రిగా ఉన్నా ఖర్చులు అన్నీ తన సొంత డబ్బుతోనే పెడతానన్నారు. ప్రభుత్వం ఖర్చుతో కప్పు కాఫీ కూడా తాను తాగలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి లాగా తనకు ప్రజాధనం లూటీ చేయడం రాదని మంత్రి ఆరోపించారు. రుషికొండ, సర్వేరాళ్ల కోసం వందల కోట్లు దుర్వినియోగం చేశారని విమర్శించారు. రెడ్ బుక్‌ను ఖచ్చితంగా ఫాలో అవుతానని ముందే చెప్పానన్నారు. ఏ అధికారులు చట్టాన్ని ఉల్లంఘించారో వాళ్ళను వదిలిపెట్టనని చెప్పానని.. తప్పు చేయని వాళ్ళు ఎందుకు భయపడాలని ప్రశ్నించారు.సినీనటికి వేధింపులు వ్యవహారం బయటకు వచ్చిందని.. ఎంత దుర్మార్గంగా వ్యవహరించారో ఆ నటి వేదన చూస్తే అర్థం అవుతోందన్నారు.వాటిలో అధికారుల ప్రమేయం బయటకు వస్తుంది.. వాటి అన్నింటి మీద విచారణ జరగాలన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల స్కూలుకు వెళ్లే విద్యార్థుల సంఖ్య 35 లక్షలకు పడిపోయిందని ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకున్న నిర్ణయాలను సమీక్షిస్తున్నామన్నారు.నాడు నేడు స్కీం.. మనబడి మన భవిష్యత్ పేరుతో కొనసాగుతుందన్నారు. సీబీఎస్‌ఈ కోర్సు పరీక్ష టఫ్‌గా ఉంటుందని.. వాళ్లకు సరైన ప్రిపరేషన్ కూడా పరీక్షలకు వెళ్లారని, అందుకే నెగటివ్ ఫలితాలు వస్తున్నాయన్నారు. విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరమని, వాటిని అమలు చేయడం కోసం ఉపాధ్యాయ సంఘాలు, మేధావుల అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమల విస్తరణ, కొత్త పెట్టుబడుల కోసం పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్నామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

## ఎపిలో కొత్త మద్యం పాలసీ రూపకల్పన

**ఐదుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ**

**అమరావతి,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**

ఏపీలో మద్యం పాలసీ రూపకల్పనకు కేబినెట్ సబ్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఐదుగురు మంత్రులతో మద్యం విధానంపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైంది. ఈ సబ్ కమిటీలో సభ్యులుగా మంత్రులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్‌లు ఉండనున్నారు. ప్రస్తుతమున్న మద్యం పాలసీని కేబినెట్ సబ్ కమిటీ సమీక్షించనుంది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న మద్యం పాలసీలను మంత్రి వర్గ ఉపసంఘం అధ్యయనం చేయనుంది. మద్యం దుకాణాలు, బార్లు, బేవరేజెస్ కంపెనీల వంటి వాటిల్లో వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలను పరిశీలించనుంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసి ఇచ్చిన అధికారుల నివేదికను మంత్రి వర్గం ఉప సంఘం పరిశీలించనుంది. మద్యం పాలసీ రూపకల్పనలో భాగంగా వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు కూడా తీసుకోనుంది.

## ఎంపాక్ కిట్‌ను ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

అమరావతి,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):ఎంపాక్స్ (మంకీపాక్స్) వ్యాధి నిర్ధారణకు ఏపీ మెడ్‌టెక్ జోన్ అభివృద్ధి చేసిన ఆర్టీ–పీసీఆర్ కిట్ 'ఎర్బాఎండీఎక్స్'ను ఏపీ సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. మెడ్‌టెక్ తమ భాగస్వామి ట్రాన్సేషియా డయాగ్నస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి దీన్ని తయారు చేసింది. ఈ విషయాన్ని సీఎం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. మంకీపాక్స్ ఆర్టీ–పీసీఆర్ కిట్.. ప్రపంచవేదికపై 'మేక్‌ఇన్ ఏపీ' ఖ్యాతిని ఘనంగా చాటుతోందన్నారు. ఈ కిట్ తయారీ బృందాన్ని సీఎం అభినందించారు. కిట్‌లోని లయోఫయలైజ్డ్ కాంపోనెంట్స్ రవాణాకు అనుకూలంగా ఉన్నాయని, అంటువ్యాధుల్ని సమర్థంగా ఎదుర్కోవడంలో ప్రభుత్వ సన్నద్ధతను ఈ కిట్

# ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర

**త్వరలోనే వివరాలు బయట పెడతాం**
**మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి**

**హైదరాబాద్,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**

ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించి తమవద్ద ఆధారాలు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు వెల్లడిస్తామని అన్నారు. కందుకూరులో 385 ఎకరాలు సర్వే నంబర్ 9లో ప్రభుత్వ భూమిని కొల్లగొట్టడానికి సర్వే చేస్తున్నారని.. తుక్కుగూడలో 25 ఎకరాలు సర్వే నంబర్ 895లో పేద రైతుల దగ్గర బినామీల పేరుతో తీసుకుంటున్నారని.. ముచ్చర్లలో ప్రభుత్వంలో పెద్దలుగా చలామణీ అవుతున్న తమ్ముళ్ల పీఏల పేరుమీద భూములు కొంటున్నారన్నారు. సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలు బయటపెడుతానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ తగ్గిందని.. రేవంత్ రెడ్డి దగ్గర ఉండి డీకే అరుణను గెలిపించారని విమర్శించారు. మోదీతో మాట్లాడుకొని వచ్చి తెలంగాణలో బీజేపీ ఎంపీలను రేవంత్ రెడ్డి గెలిపించారన్నారు. రుణమాఫీపై తాము రిపోర్ట్ ఇస్తే రేవంత్ రెడ్డి సీఎం పదవిలో ఉండి ఎందుకని ప్రశ్నించారు. ప్రజల కోసం పోరాడే బాధ్యతను ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఇచ్చారన్నారు. సీఎం స్థాయిలో ఉండి సుప్రీంకోర్టు తీర్పును తప్పుబట్టడం నేరమని హరీశ్‌రావు అన్నారు. వక్రబుద్ధి ఉంటే అన్ని వంకరగా కనిపిస్తాయని.. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి బెయిల్ బీజేపీ ఇస్తేనే వచ్చిందా..? అంటూ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. కవిత బెయిల్ విషయంలో న్యాయం, ధర్మం గెలిచిందని.. ఈడీ, సీబీఐపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిందన్నారు. సిసోడియాకు బెయిల్ వస్తే బీజేపీతో పోరాటం.. కవితకు బెయిల్ వస్తే బీజేపీతో లాలూచీనా..? అంటూ నిలదీశారు. కవితకు బెయిల్ రావడాన్ని కేశవరావు స్వాగతించారన్నారు. బుద్ధ భవన్, జీహెచ్ఎంసీ కార్యాలయం నాలాపై ఉన్నాయని.. మొదట వాటిని కూల్చాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తమ ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి భవనాలు ఎలా కూలగొడుతారని ప్రశ్నించారు. నెక్లెస్ రోడ్, లుంబినీ పార్క్, హోటల్స్, క్లబ్స్ దేని కింద ఉన్నాయని ప్రశ్నించారు. మీర్‌ఆలం, ఉప్పల్, రామంతాపూర్ చెరువులో పెద్దపెద్ద టవర్లు ఉన్నాయని.. అవన్నీ పట్టాభూములు.. వారికి పరిహారం ఇవ్వాలన్నారు. మంత్రి పొంగులేటి నివాసం నుంచి డ్రైనేజీ నీళ్లు ఎక్కడికి పోతున్నాయని.. ముఖ్యమంత్రి పరోక్షంగా తనమంత్రిని తిడుతున్నారా? అంటూ చురకలంటిం చారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం మంచిదికాదన్నారు. చిత్తశుద్ధి ఉంటే హైడ్రా పరిధిలోని ఆక్రమణలు కూల్చివేయాలన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలపై ఉన్న ఆస్తులను కూల్చివేయాలన్నారు. కాళేశ్వరం మరమ్మతుల విషయంలో నాకే అవకాశం ఇస్తామన్నారని.. నేను సిద్ధపడితే రేవంత్‌రెడ్డి తోక ముడిచారని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి భూమిపూజ చేస్తే మంత్రులు కూడా లేరన్నారు.

## హరీష్ రావుది చీప్ పాలిట్రిక్స్

**హైదరాబాద్,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**


సీఎం రేవంత్ రెడ్డిది చిట్ చాట్ కాదని.. చీప్ చాట్ అని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కౌంటర్ ఇచ్చారు. హరీష్ రావుది చిట్ చాట్ కాదని.. సోది చాట్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో చీప్ పాలిటిక్స్‌కు హరీష్ రావు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ అక్రమ కట్టడాలు కూల్చేస్తే బీఆర్ఎస్ నేతలకు వచ్చిన నష్టమేంటని ప్రశ్నించారు. చెరువును అక్రమంగా ఆక్రమించి హీరో నాగార్జున నిర్మించిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతను హరీష్ రావు స్వాగతిస్తున్నారా లేదా అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా నిబంధల ప్రకారమే నడుస్తోందని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కాగా, గత కొన్ని రోజులుగా స్టేట్ పాలిటిక్స్‌లో హైడ్రా హాట్ టాపిక్‌గా మారింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు, కుంటలు అక్రమణలకు గురి కాకుండా.. ఇప్పటి వరకు కబ్జాకు గురిన వాటిని రక్షించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా హైడ్రా దూకుడుగా పని చేస్తోంది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలను ఎక్కడికక్కడ నేల మట్టం చేస్తోంది. సామ్యానులు, సెలబ్రెటీలు అనే తేడా లేకుండా కట్టడాలు ఇల్లీగల్ అనే తేలితే చాలు ఘటన స్థలంలో వాలిపోయి.. అక్రమ కట్టడాలను కూల్చి పడేస్తున్నారు హైడ్రా అధికారులు, సిబ్బంది. దీంతో హైడ్రా అధికార, ప్రతిపక్షాల మధ్య డైలాగ్ వార్‌కు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation

శుక్రవారం । ఆగస్టు । 30 । 2024



# తెలుగు భాష దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు





**చెన్నూరు, ఆగస్టు 29 (పీపుల్స్ మోటివేషన్):-**

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు తెలుగు సాహిత్యం లో కడప కవుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ వ్యాసరచన పోటీలలో చిన్న మాచుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, అలాగే చెన్నూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ వ్యాసరచన పోటీలలో చిన్నమాచపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని డి. జాహ్నవి ప్రథమ బహుమతి సాధించడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై. అరుణకుమారి తెలుగు భాషా దినోత్సవం గురించి మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పదనం, తెలుగు భాష తీయదనం గురించి మన తెలుగు భాష పండితులు, కవులు ఎన్నో కవిత్వాలను, మరెన్నో కావ్యాలను రచించడం జరిగిందన్నారు, ఏ దేశమేగినా ఎందుకు కాలిడిన పొగడరా నీ తల్లి తెలుగు భారతీని అని ఎంతోతీయతనంగా, మరెంతో ఆప్యాయంగా, మరెంతో అమ్మ పిలుపుతనంగా రచించిన మహాకవులందరికీ కూడా తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కృతజ్ఞతలు చేశారు, "దేశభాషలందు తెలుగు భాష లెస్స" అన్ని భాషలలోకెల్లా తెలుగు భాష గొప్పదనం అలాగే తొలి తెలుగు శాసనం లభించిన కలమల్ల లో ఏర్పాటు చేసిన సభలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా బహుమతి ప్రశంసా పత్రం అందుకున్న విద్యార్థిని కుమారి డి.జాహ్నవి ని ఈ సందర్భంగా ఆమె అభినందించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు భాషను మరవడం, తెలుగు తల్లిని మరవడం, అంటే కన్న తల్లిని మరిచినట్లేనని చిన్నారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉమ్మడి మండల తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**డిప్యూటీ ఈఓ ఎంఈఓ ప్రమోషన్లు ఇవ్వాలి**
**అమరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్**



**పెబ్బేరు, ఆగస్టు 29 (పీపుల్స్ మోటివేషన్) :**


పెబ్బేరు శ్రీరంగాపూర్ ఉమ్మడి మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం ఉమ్మడి మండలంలోని వివిధ ఉన్నత,ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం,సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అమరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏకీకృత సర్వీస్ రూల్స్ ను క్లియర్ చేసి డిప్యూటీ ఈవో, ఎంఈఓ జూనియర్ లెక్చరర్ డైట్ లెక్చరర్ ప్రమోషన్లు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 5 డిఏ లతోపాటు పిఆర్సిని,వెంటనే అమలు చేయాలని కేజీబీవీ ఎస్ ఎస్ ఎ, ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ మినిమం, (టైం స్కేల్) ఇస్తూ, బెడ్ చేసిన ఎస్ జి టి,ఉపాధ్యాయులకు కూడా ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా అవకాశం కల్పించాలని మోడల్ స్కూల్,గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు, పరిష్కరించాలని 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్,సాంస్కృతిక కన్వీనర్ సుదర్శన్, మీడియా కన్వీనర్ శశివర్ధన్, టెక్నికల్ కన్వీనర్ మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, సతీష్ కుమార్, కార్యదర్శిసురేందర్, సురేష్ తదితర టాపర్స్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ప్రభుత్వ బీసీ బాలుర,బాలికల వసతి గృహ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టండి

**దేవనకొండలో మోడల్ స్కూల్ ఏర్పాటు కోసం అసెంబ్లీలో చర్చించాలి**
**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆలూరు శాసనసభ్యులు బూసినే విరుపాక్షికి వినతిపత్రం అందజేత**

**దేవనకొండ, ఆగస్టు 29 (పీపుల్స్ మోటివేషన్):-**

మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని తక్షణమే పునః ప్రారంభించాలని,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల,అధ్యక్ష కార్యదర్శులు మధు,భాస్కర్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం దేవనకొండకు వచ్చిన ఆలూరు శాసనసభ్యులు బూసినే విరుపాక్షి గారికి ఏఐఎస్ఎఫ్ మండల ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.... జిల్లా నిత్యం కరువు,కాటకాలకు నిలయంగా మారిందని అన్నారు.కరువు తో పాటు నిరక్షరాస్యత అధికంగా ఉందని అన్నారు.ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని,వెళ్లే సమయంలో వారి పిల్లల చదువులకై ప్రభుత్వ పాఠశాలల్లో వదిలి వెళ్లడం జరుగుతుందని,మండల కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యయప్రాయసాలతో వందలాది మంది విద్యార్థులు విద్యాను అభ్యసిస్తున్నారని,చదువుకునేందుకు పాఠశాలలు ఉన్నా, ఉండేందుకు వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో గత 40 సంవత్సరాలుగా డిఎన్ టి వసతి గృహం ఉండేదని,పక్కా గృహం లేదని, ఇతర కారణాలు చూపి,నిర్వహణ లోపంతో మూసివేయడం ఏంటని ? ఆగ్రహం వ్యక్తం చేశారు.వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు టీసి లు తీసుకొని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని, దీంతో అడ్మిషన్లు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అదేవిధంగా మండల కేంద్రంలో బాలికల వసతి గృహం లేకపోవడంతో కర్నూలు,ఆదోని తదితర ప్రాంతాలకు విద్యాను అభ్యసిస్తున్నారని అన్నారు. పలుమార్లు అధికారులకు విన్నపించిన, వాటిని గాలికొదిలేశారని ఆరోపించారు. దశల వారీ ఉద్యమాల్లో భాగంగా ఎమ్మెల్యే కి వినతిపత్రం అందజేశామని,ప్రజా ప్రతినిధులుగా తక్షణమే స్పందించి,మండల కేంద్రంలో మూసివేసిన బీసీ బాలుర వసతి గృహాన్ని పునః ప్రారంభించి,బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ను ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ వినతిపత్రాన్ని సమర్పించిన వారిలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు ఇజాజ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నంద్యాలలో భారీ ర్యాలీ






**నంద్యాల, ఆగస్టు 29 (పీపుల్స్ మోటివేషన్):-**

నంద్యాలలో వెయ్యి మంది పైగా విద్యార్థులతో జూనియర్ కాలేజ్ మరియు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో మేజర్ ధ్యాంచంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీని టెక్కే మార్కెట్ యార్డ్ నుండి డి.ఎస్ఏ స్టేడియం వరకు జరిగినది. ఈ ర్యాలీని తెలుగుదేశం పార్టీ నాయకులు, యువకిశోరం ఎన్ఎండి ఫిరోజ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కర్నూలు జిల్లా ఒలింపిక్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ జి రవికృష్ణ, డిప్యూటీ డిఇఓ ఆఫీసర్, మహమ్మద్ బేగ్, ఎంఈఓ 2 శివరామకృష్ణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ భవిష్యత్తులో నంద్యాల లో జరగబోయే మరిన్ని క్రీడలకు విజయవంతం కావడానికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ డి ఓ రాజు, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వి శివకుమార్, ఏపి పిఈటిఎస్ ఏపీ ఇ జిల్లా కార్యదర్శి బి రవికుమార్, ఎన్సిసి ఆఫీసర్ ఏం రవికుమార్, వ్యాయామ సంచాలకులు విజయ భరత్ రెడ్డి, పద్మావతి, స్టేడియం శిక్షకులు కిషోర్, సుదర్శన్, లక్ష్మణ్, పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయడం జరిగింది.

# స్పెషల్ ఫీవర్ సర్వే నిర్వహించిన వైద్య సిబ్బంది





**దేవనకొండ, ఆగస్టు 29 (పీపుల్స్ మోటివేషన్):-**

గురువారం రోజు దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నేలతరమర్రిగ్రామంలో స్పెషల్ ఫీవర్ సర్వే రెండో దశ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి జ్వరం వచ్చిన వారికి రక్త పూతలు తీయడము జరిగినది తరువాత వాటిని దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ లోపరీక్షలు నిర్వహించడం జరిగినది. ఇందులో ఎవరికైనా మలేరియా గాని డెంగు గానీ ఉన్నట్లయితే అటువంటి వారికి వెంటనే ఆ వ్యాధికి సంబంధించినటువంటి ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుంది అని అలాగే వైరల్ ఫీవర్ గాని టైఫాయిడ్ కానీ ఉన్న వ్యాధిగ్రస్తులకు కూడా పరీక్షల నిర్వహించాలని ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది అయినటువంటి ఏఎన్ఎం మరియు ఎం.ఎల్.హెచ్.పి లకు సూచించడం జరిగినది అలాగే గ్రామస్తులకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాటి వలన కలుగు వ్యాధి గురించి వారికి తెలియజేయడం జరిగింది ఇందులో సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబ సూపర్వైజర్ శ్రీధర్ ఏఎన్ఎం ఎంఎల్ హెచ్పి ఆశాలు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శుక్రవారం । ఆగస్టు । 30 । 2024


# వెన్నెముకగా చిన్నతరహా పరిశ్రమలు !

దేశ సర్వతోముఖాభివృద్ధికి, పారిశ్రామిక ప్రగతికి చిన్న తరహా పరిశ్రమలు వెన్నెముకగా నిలవడంతో పాటు ఉద్యోగ ఉపాధుల కల్పనలో పెద్ద ఎత్తున దోహదపడుతున్నాయి. ఈ విషయాలను గ్రహించిన భారత ప్రభుత్వం 30 ఆగష్టు 2000న చిన్న తరహా పరిశ్రమలకు ఊతం ఇవ్వాలనే సదుద్దేశంతో సమగ్ర పాలసీ ప్యాకేజీని తీసుకురావడం జరిగింది. సమగ్ర దేశాభివృద్ధిలో సింహ భాగం తీసుకోవడంతో ఆ రోజుకు గుర్తుగా 2001 నుంచి ప్రతి ఏట 30 ఆగష్టు రోజున దేశవ్యాప్తంగా పౌర సమాజం, పరిశ్రమ వర్గాలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు 'జాతీయ చిన్న పరిశ్రమల దినం (నేషనల్ స్మాల్ ఇండస్ట్రీ డే)' పాటించడం ఆనవాయితీగా మారింది. దేశాభివృద్ధిలో చిన్న తరహా పరిశ్రమల పాత్రను కొనియాడడం, ప్రోత్సహించడం, ఆర్థిక సహాయం చేయడం, సఫల చిన్న పరిశ్రమల యాజమాన్యాలను సన్మానించడం, సుక్ష్మ/చిన్న/మధ్య తరహా పరిశ్రమలకు(ఎంఎస్ఎంఈ) చేయూతనివ్వడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, ప్రజల్లో వీటి పట్ల అవగాహన పెంపొందించడం, కష్ట సమయాల్లో ఆదుకోవడం, వాటి అవసరాలను సింగిల్ విండో విధానంలో పరిష్కరించడం లాంటి ఉద్దేశాలను ప్రచారం చేసే వేదికగా 'జాతీయ చిన్న పరిశ్రమల దినం' ఉపయోగపడుతున్నది. పది కోట్లకు మించని పెట్టుబడులతో ప్రారంభమై, 50 కోట్లకు మించని వార్షిక ఆదాయాన్నిచ్చే పరిశ్రమలను చిన్న పరిశ్రమలు అని అంటాం. నేడు అత్యంత భారీ పరిశ్రమలను నడుపుతున్న యాజమాన్యాలు తొలినాళ్లలో చిన్న పరిశ్రమల స్థాపనతోనే ఎదిగిన వారే అని గమనించాలి. రిలియన్స్, ఇన్ఫోసిస్ లాంటి అనేక ప్రఖ్యాత కంపెనీలు కొన్ని దశాబ్దాల క్రితం చిన్న పరిశ్రమలుగానే ప్రారంభం అయినట్లు మనకు చరిత్ర వివరిస్తున్నది. సృజనశీలురు, విలక్షణ ఆలోచనపరులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా వేల/లక్షల మంది సుక్ష్మ, చిన్న పరిశ్రమ స్థాపనకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఉన్నత విద్య అభ్యసించిన యువత ఉద్యోగాల వెంట పడకుండా స్వంతం చిన్న పరిశ్రమలను ప్రారంభిస్తున్నారు, అనేకులు సఫలం కూడా అవుతున్నారు.

పేద వర్గాలకు చెందిన యువ విద్యావేత్తలకు చిన్న/మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సీడీలతో కూడిన లేదా వడ్డీ లేని రుణాల రూపంలో ఆర్థిక సహాయం కూడా అందించడం జరుగుతోంది. డిజిటల్ ప్రపంచ ఆలోచనలను పసిగట్టి వైవిధ్యమైన వస్తువులను తయారు చేయడం, భారీ పరిశ్రమలకు ముడి సరుకు లేదా మధ్యంతర వస్తువులను అందించడం, వస్తు పంపిణీ వ్యవస్థలో కీలక పాత్ర వహించడం లాంటి ప్రధాన బాధ్యతలను సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు సమర్థవంతంగా మోస్తున్నాయి. అధిక శాతం దేశ యువత ఎంఎస్ఎంఈ రంగాల్లో ఉద్యోగ ఉపాధులు పొందుతున్నారని గమనించాలి. భారతదేశవ్యాప్తంగా 6.3 కోట్లకు పైగా ఎంఎస్ఎంఈలు పని చేస్తున్నాయి. ఈ పరిశ్రమలు భారీ అంతర్జాతీయ సంస్థలకు అవసరమైన విడి భాగాలను సరఫరా చేయడం జరుగుతోంది. దేశ ఎగుమతుల్లో అధిక భాగం ఈ రంగంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. జౌళి, తోలు, ఔషధాలు, ఆటోమోటివ్స్, ఆభరణాలు, రత్నాలు లాంటి అనేక ఉత్పత్తులు 45 శాతం వరకు ఎంఎస్ఎంఈల ద్వారానే జరుగుతున్నాయి. ఎంఎస్ఎంఈల కృషితో 2025 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ వ్యవస్థగా అవతరించనున్నది. 2020 నుండి "ఆత్మ నిర్భర్ భారత్" ప్యాకేజీ కింద ఎంఎస్ఎంఈలకు భారీ ఎత్తున ఊతం ఇవ్వడం కొనసాగుతున్నది. చిన్న పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పన, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం, సాంస్కృతిక వారసత్వాన్ని/సంప్రదాయాలను సంరక్షించడం లాంటి పలు ప్రయోజనాలు కలిగి ఉన్న ఎంఎస్ఎంఈలను కాపాడుకోవడం మనందరి కనీస బాధ్యత అని గమనించాలి. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడానికి ఎగ్జిబిషన్స్, ట్రేడ్ ఫెయిర్స్, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అవార్డులు, గుర్తింపులు, విధాన పరమైన మద్దత్తు ఇవ్వడం నిరంతరం కొనసాగాలి. ఆర్థిక సహాయం, డిజిటల్ టెక్నాలజీని అందుబాటులోకి తేవడం లాంటివని కాలానుగుణణగా జరగాలి.దేశాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్న ఎంఎస్ఎంఈలను అక్కున చేర్చుకొని, అవసరమైన మద్దత్తు ఇస్తూ నిబద్ధతతో కూడిన చేయూతను అందిద్దాం, ఆ యాజమాన్యాలకు విశ్వాసం కలిగిద్దాం.

# అణు భౌతికశాస్త్ర పితామహుడు

ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871– అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయనిజ్ఞుడు, ఇతనికి అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి. ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియజెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశపెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన– కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు. అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్ధాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహదపడింది) ను ప్రతిపాదించాడు. ఇతడు రూథర్‌ఫోర్డ్ ఖ–కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా ఖ–కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. ఇతడికి 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనంలోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయస్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయసులోనే కెనడాలోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్న మయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం (%ఝుఽఱశీ ఖఽఱజవ ఽవఝుఽ%) నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్థ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు. కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫాకిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువుల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను ఖ – కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్యరంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

# హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే ఖబర్దార్

**డబ్బులు వసూలు చేస్తే తాట తీస్తామని సిఎం హెచ్చరిక**
**విజిలెన్స్ పెట్టాలని అధికారులకు ఆదేశాలు**
**అక్రమ నిర్మాణాలకు అనుమతించిన అధికారులపై హైడ్రా నజర్**

**హైదరాబాద్,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్):**

హైడ్రా పేరు చెప్పి కొందరు అవినీతికి పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డుపెట్టుకొని డబ్బులు అడుగుతున్నట్లు తెలిసిందన్నారు. అమాయకులను భయపెట్టి డబ్బు వసూలు చేస్తున్నారని, కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని సీఎం చెప్పారు. అక్రమంగా డబ్బు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసూళ్లకు పాల్పడే వారిపై దృష్టి పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు. ఇదిలావుంటే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రాకు స్వేచ్ఛ ఉండటంతో జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తుంది. తన, మన అనే భేదం లేకుండా అక్రమణ అని తేలితే చాలు యాక్షన్‌లోకి దిగి పని పూర్తి చేస్తోంది. గంటల వ్యవధిలో పెద్ద పెద్ద భవంతులను నేలమట్టం చేస్తోంది. హైడ్రా దూకుడుతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఎక్కడి నుండి వచ్చి తమ అక్రమ కట్టడాలను నేల మట్టం చేస్తారోనని భయంతో గజ గజ వణికిపోతున్నారు అక్రమణదారులు. ఏర్పాటైన రోజుల వ్యవధిలోనే తన విధానమేంటో స్పష్టం చేసిన హైడ్రా.. సామాన్య ప్రజల నుండి బడా నేతలు, సెలబ్రెటీలకు చెందిన అక్రమ కట్టడాలను కూల్చి పడేసింది. అయితే, కూల్చివేతల సమయంలో కొన్ని చోట్ల హైడ్రాకు ఇబ్బందులు ఎదురు అవుతున్నాయి. అధికారులు అనుమతి ఇస్తేనే తాము నిర్మించుకున్నామని.. ఇందులో తమ తప్పేముందని హైడ్రా అధికారులను నిలదీస్తున్నారు పలువురు నిర్మాణదారులు. ఈ క్రమంలో హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని హైడ్రా డిసైడ్ అయినట్లు సమాచారం. మొదటి స్టేజ్‌లో భాగంగా ఎఫ్టీఎల్ పరిధిలో కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై యాక్షన్ తీసుకోవాలని ఫిక్స్ అయ్యిందట హైడ్రా. అనంతరం బఫర్ జోన్లలో నిర్మాణలకు అనుమతులిచ్చిన అధికారుల వివరాలు సేకరించి వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధం అయినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు హైడ్రా సిఫార్స్ చేసినట్లు సమాచారం. చందానగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, హెచ్ఎండీ అసిసెంట్ ఎ÷–లానింగ్ ఆఫీసర్, గండిపేట సూపరింటెండెంట్, నిజాంపేట మున్సిపల్ కమిషనర్, సర్వేయర్, నిజాంపేట ఎమ్మార్వోలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫార్స్ చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు అక్రమ కట్టడాలను కూల్చిన హైడ్రా.. ఇకపై ఇల్లీగల్ కన్ స్ట్రక్షన్స్‌కు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై చర్యలకు సిద్ధం కావడంతో సంబంధిత శాఖ అధికారుల్లో దడ మొదలైంది.

# కన్నయ్యనాయుడుకు కీలక బాధ్యతలు

**అమరావతి,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్) :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర జలవనరులశాఖ మెకానికల్ సలహాదారుడిగా కన్నయ్యనాయుడును నియమించింది. ఈ మేరకు గురువారం నియమక ఉత్వర్వును జారీ చేసింది. ఇటీవల తుంగభద్ర డ్యాంకు చెందిన ఒక గేట్ కొట్టుకుపోయి నీరంతా సముద్రంలో కలిసి పోయింది. ఈ పరిస్థితుల్లో నీటిపారుదల రంగానికి చెందిన సీనియర్ ఇంజినీర్ కన్నయ్యనాయుడు సేవలను ప్రభుత్వం వినియోగించు కుంది. తుంగభద్ర డ్యామ్‌లో గల్లంతైన 19వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ ఏర్పాటు దగ్గరుండి చేయించి నీటి వృథాను అడ్డుకున్నారు. డ్యాంల గేట్లు తయారీలో నైపుణ్యం ఉన్న సాగునీటి నిపుణులు కన్నయ్య నాయుడిని చంద్రబాబుతో పాటు మంత్రులు సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల గేట్ల విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం కన్నయ్యనాయుడిని సలహాదారుడిగా నియమించింది. ప్రాజెక్టు గేట్ల నిర్వహణలో ఆయన ప్రభుత్వానికి సలహాలు ఇవ్వనున్నారు.

# ఆధునిక తెలుగు వైతాళికుడు

తెలుగు భాషా మాధుర్యాన్ని తెలుగు వారందరూ ఆస్వాదించి తరించాలి. కానీ, వందేళ్ల క్రితం ఈ పరిస్థితి లేదు. నాటి సాహిత్యంలో, పాఠ్య పుస్తకాలలో, ప్రసార మాధ్యమాలలో తెలుగు భాష కఠినమైన గ్రాంథిక రూపంలో ఉండేది. గ్రాంథిక భాషను పండితులు తప్ప విద్యార్థులు, సామాన్యులు అర్థం చేసుకోవడం చాలా కష్టంగా ఉండేది. ఈ విషయాన్ని అప్పట్లో గిడుగు రామమూర్తి గుర్తించారు. ఈ విధానం సరికాదనీ, తెలుగు భాషను మనం సాధారణంగా మాట్లాడే వ్యావహారిక భాషలోనే బోధించాలనీ, రాయాలనీ ఒక ఉద్యమాన్నే చేశారు. ఈ ఉద్యమమే వ్యవహారిక భాషోద్యమం. గిడుగు రామమూర్తి చేసిన ఎన్నో ఏళ్ళ పోరాటం, కృషి ఫలితంగానే నేడు మనం పాఠశాలల్లో, సమాచార, ప్రసార మాధ్యమాల్లో, సాహిత్యంలో వాడుక భాషను ఉపయోగిస్తున్నాం. 1863 ఆగస్టు 29న శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో జన్మించిన గిడుగు వెంకట రామమూర్తి, పర్లాకిమిడి మిడిల్ స్కూల్లో ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆ రోజుల్లో గురజాడ అప్పారావు, రామమూర్తి సహాధ్యాయి. వ్యవహారిక భాషోద్యమ ప్రారంభానికి ఓ ఆసక్తికర నేపథ్యం ఉంది. 1907 ప్రాంతంలో మద్రాసు, రాజమండ్రి ప్రాంతాల్లో జే.ఏ. యేట్సు అనే ఇంగ్లీషు దొర పాఠశాలల తనిఖీ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించేవారు. ఆయన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి పట్టభద్రుడై, ఉద్యోగం నిమిత్తం భారతదేశం వచ్చాడు. జే.ఏ. యేట్సు దొరకి తెలుగు నేర్చుకోవాలన్న ఆసక్తి ఉండేది. ఈ క్రమంలో పాఠశాలల్లో తెలుగు బోధించే విధానానికి, బయట తెలుగు మాట్లాడే విధానానికి చాలా తేడా ఉందని ఆయన గమనించాడు. పాఠ్యపుస్తకాల్లో ఉన్న తెలుగు, వ్యవహారిక భాషగా ఉన్న తెలుగు రెంటిలో ఎందుకు తేడా ఉందో అర్థం కాలేదు. ఇదే విషయాన్ని విశాఖపట్నంలో ఏ.వీ.ఎన్. కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న పి.టి. శ్రీనివాస అయ్యంగారిని అడిగితే ఆయన గురజాడ, గిడుగులు దీనికి సమాధానం చెబుతారని అన్నారు. అప్పటికే గిడుగు వారు తెలుగు భాషా శాస్త్రవేత్తగా ఎంతో లోతైన విషయ పరిజ్ఞానాన్ని సంపాదించారు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు దొర ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. వ్యవహారిక భాషోద్యమాన్ని పూర్తిగా తన భుజానికెత్తుకొని ముందుకి తీసుకువెళ్లి విజయం సాధించేవరకు రామమూర్తి అవిశ్రాంతంగా కృషి చేసారు. అప్పటి స్కూలు, కాలేజీ పుస్తకాల్లో గ్రాంథికభాషే పాతుకుపోయింది. కొన్నిటిలో వీరేశలింగం గారు ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గ్రాంథికం, వ్యవహారిక భాషలపై లోతైన పరిశోధన చేసిన గిడుగు రామమూర్తి. ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేదని నిరూపించాడు. 1919లో "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు. సాంప్రదాయవాదులు కొందరు వ్యవహారిక భాషా ఉద్యమాన్ని వ్యతిరేకించినప్పటికీ చివరిగా గిడుగు వారి అభిప్రాయంతో ఏకీభవించారు. 1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆధికారికంగా వ్యావహారిక భాషపై నిషేధాన్ని ఎత్తివేసింది. ఇలా వాడుక భాషా బోధనా, రచనలను పండితులందరూ ఆమోదించారు. గిడుగు రామమూర్తి గారి కృషి కారణంగానే నేడు మనం పాఠశాలల్లో, సమాచార ప్రసారసాధనాల్లో, సాహిత్యంలో మాట్లాడే భాషను ఉపయోగించుకోగలుగుతున్నాం. తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన గిడుగు రామమూర్తి 1940, జనవరి 22న కన్ను మూశారు. గిడుగు జయంతిని పురస్కరించుకొని వాడవాడలా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆయన కృషికి గొప్ప నివాళి. అక్కిరాజు ఉమాపతిరావు గిడుగు వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ ఇలా అన్నారు.. "ఆయన స్థిత ప్రజ్ఞుడు, స్థిర సంకల్పుడు, వాజ్మి, మేధానిధి, పండితమౌళి, సాంప్రదాయ పరిరక్షకుడు, అభ్యుదయగామి".

# హైడ్రాకు పెరుగుతున్న మద్దతు

**కూల్చివేతలు కొనసాగించాలన్న ఎంపి**
**25 లక్షల ఆర్థిక సాయం అందించిన అనిల్**

**హైదరాబాద్,ఆగస్ట్29(పీపుల్స్ మోటివేషన్) :**

హైదరాబాద్ నగరంలో చెరువులు, కుంటలను ఆక్రమించి అక్రమ కట్టడాలకు తెర లేపిన అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తోంది హైడ్రాకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. తాజాగా మైడ్రాకు ఆర్థిక సాయం కూడా అందుతోంది. అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న హైడ్రాకు మద్దతుగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ నిధులు అందజేశారు. ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ. 25 లక్షలు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ అనిల్ కుమార్.. హైడ్రా పనితీరు బాగుందని, హైడ్రా మరింత చురుకుగా పని చేయాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులను కాపాడేందుకే సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారని ఎంపీ పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్.. హైదరాబాద్ మహానగరంగా తీర్చిదిద్దుతామన్నారని, కానీ అందుకు విరుద్ధంగా చేశారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్‌లోని చెరువులన్నీ కబ్జాకు గురయ్యాయన్నారు. కనీసం ఒక్క చెరువును కూడా కాపాడలేకపోయారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్ తరాల గురించి ఆలోచించి.. హైదరాబాద్ సస్యశ్యామలంగా ఉండాలని కీలక నిర్ణయం తీసుకున్నారన్నారు. రాజకీయాల కోసం హైడ్రా అని కొందరు విమర్శలు చేస్తున్నారని.. ఇది హైదరాబాద్ అభివృద్ధి కోసం చేస్తున్నారని ఎంపీ స్పష్టం చేశారు. దేశంలోని అనేక నగరాల్లో నీటి కొరత ఏర్పడుతుందని.. అలాంటి ఇబ్బందులు హైదరాబాద్‌లో రావొద్దనే ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు. పదేళ్ల క్రితం నగరంలో అనేక చెరువులు నిండు కుండ మాదిరిగా ఉండేవన్నారు. అక్రమ కట్టడాలు చేపట్టిన వారు ఎవరైనా హైడ్రా వదిలిపెట్టదని ఎంపీ అనిల్ కుమార్ వ్యాఖ్యానించారు. డ్రగ్స్ నివారణ విషయంలో కూడా సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. హైడ్రాను ఇతర జిల్లాలలో కూడా అమలు చేయాలనే వినతులు ప్రభుత్వానికి అందుతున్నాయని.. జిల్లాలకు హైడ్రా విస్తరించాలని ఎంపీ అభిప్రాయపడ్డారు. హైడ్రాకు పూర్తి మద్దతు ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు పల్లం రాజు సోదరుడు ఇంటికి కూడా కూల్చివేశామని ఎంపీ అనిల్ గుర్తు చేశారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

## ఎస్‌బిఐ ఛైర్మన్‌గా శ్రీనివాసులు శెట్టికి బాధ్యతలు




దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయాన్ని ఆ బ్యాంక్ మంగళవారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఇప్పటి వరకు ఛైర్మన్‌గా ఉన్న దినేష్ ఖారా పదవీ విరమణ పొందారు. ఖరా 2020 అక్టోబర్‌లో నియమితులు కాగా.. ఆయన పదవీకాలం 2024 ఆగస్టు 28తో ముగిసింది. కాగా.. 59 ఏళ్ల శెట్టి ఇంతక్రితం అత్యంత సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయన పలు కేంద్ర ప్రభుత్వ కమిటీల్లో పని చేశారు. ఇప్పటి వరకు బ్యాంక్ రిటైల్ అండ్ డిజిటల్ బ్యాంకింగ్ పోర్టుపోలియో బాధ్యతలను చూశారు.దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థగా ఉన్న ఎస్‌బిఐ చీఫ్ బాధ్యతలు తొలిసారి ఓ తెలుగు వ్యక్తికి దక్కడం విశేషం. ప్రభుత్వ రంగ సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల నియామాక సంస్థ అయినా ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్స్‌ట్యూషన్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబి) ఎస్‌బిఐ తదుపరి చైర్మన్‌గా శ్రీనివాసులు శెట్టిని ఎంపిక చేస్తూ ఇటీవల సిఫార్సు చేయగ.. కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శ్రీనివాసులు శెట్టి 1988లో ప్రొబిషనరీ ఆఫీసర్‌గా ఎస్‌బిఐలో తన కేరీర్‌ను ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ.. 2020లో ఎస్‌బిఐ బోర్డులో ఎండిగా చేరారు. ఛైర్మన్ హోదాకు ముందూ ఆయన ఎస్‌బిఐ అంతర్జాతీయ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించిన శ్రీనివాసులు శెట్టి అగ్రికల్చర్ సైన్స్‌లో డిగ్రీ పొందిన ఆయన 1988లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఎస్‌బిఐలో తన కేరీర్‌ను ప్రారంభించి.. అంచెలంచెలుగా ఎదిగారు. 36 ఏళ్లు పైగా సాగిన కెరీర్‌లో కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, అభివృద్ధి చెందిన దేశాల మార్కెట్‌లలోని బ్యాంకింగ్‌లో విశేష అనుభవం కలిగి ఉన్నారు. న్యూయార్క్‌లోని విభాగానికి వైస్ ప్రెసిడెంట్ వంటి కీలక బాధ్యతలను నిర్వహించారు.

## పండగకు ముందు పెరగనున్న వంటనూనెల ధరలు..!



త్వరలోనే పండగల సీజన్ మొదలుకానున్నది. ఈ క్రమంలోనే కేంద్రం కీలక నిర్ణయం తీసుకోబోతునన్నది. ఎడిబుల్ ఆయిల్స్ దిగుమతిపై సుంకం పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఫలితంగా వంటనూనెల ధరలు పెరగనున్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యాపారుల ఒత్తిడి నేపథ్యంలో ఈ కేంద్రం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇంతకు ముందు మధ్యప్రదేశ్ వ్యాపారుల ఒత్తిడితో శనగలపై స్టాక్ పరిమితి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఎడిబుల్ ఆయిల్స్‌పై దిగుమతి సంకాన్ని పెంచాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సూచించింది. దేశీయ నూనె గింజల ఉత్పత్తిదారుల ప్రయోజనాలను పరిరక్షించడమే దీనికి కారణమని మంత్రిత్వశాఖ పేర్కొంది. సోయాబీన్ ప్రాసెసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ దేవిశ్ ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో ఆయన సమావేశమయ్యారు. దిగుమతి చేసుకునే నూనెలపై సుంకాన్ని పెంచాలని సోపా చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నది. దీంతో రైతులు తమ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర పొందేందుకు వీలు ఉంటుంది. దేశీయ ఆయిల్ పరిశ్రమ నుంచి ఒత్తిడి సైతం తొలగిపోతుందని సోపా పేర్కొంటుంది. ముడి పామాయిల్, సోయాబీన్ ఆయిల్, ముడి సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై 5.5 శాతం దిగుమతి సుంకం వర్తిస్తుంది. ఇందులో సెస్ సైతం ఉంటుంది. అదేవిధంగా రిఫైన్డ్ ఎడిబుల్ ఆయిల్‌పై 13.75 శాతం కస్టమ్స్ డ్యూటీ వర్తిస్తుంది. ఇదిలా ఉండగా మధ్యప్రదేశ్‌లో సోయాబీన్ ధర పడిపోవడంతో సోయాబీన్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కస్టమ్స్ సుంకాన్ని పెంచనంత వరకు నూనెగింజల ఉత్పత్తిని పెంచేలా రైతులను ప్రోత్సహించడం భావిస్తున్నారు. గతంలో రాష్ట్ర వ్యాపారుల డిమాండ్ వరకు శనగలపై స్టాక్ పరిమితిని తొలగించడం గమనార్హం. మరో వైపు కేంద్ర ప్రభుత్వం రూ.6800కోట్లతో త్వరలోనే జాతీయ నూనెగింజల మిషన్‌ను ప్రకటించనున్నది. అలాంటి పరిస్థితిలో స్థానిక ఉత్పత్తులకు మంచి ధర కోసం ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచే అవకాశాలున్నాయి.

# కార్ల షాకింగ్ అమ్మకాలు..

దక్షిణ కొరియా కంపెనీకి చెందిన కియా కార్లు భారతదేశంలో దూసుకుపోతున్నాయి. ఈ కంపెనీ నుంచి ఇప్పటికే సోనెట్, సెల్టోస్, కారెన్స్, కార్నివాల్ అనే మోడళ్లు భారత్ లో ప్రాచుర్యం పొందాయి. ఎస్ యూవీ వేరియంట్ కావాలనుకునే వారికి కియా కార్లు బాగా నచ్చుతాయి. అయితే ఎస్ యూవీ ఫార్మాట్ లో ఎన్ని కార్లు వచ్చినా లేటెస్ట్ టెక్నాలజీతో పాటు ఆధునిక ఫీచర్స్ కలిగిన కియా కార్లను ఎక్కువగా కోరుకుంటున్నారు. దీంతో భారత్ కు వచ్చిన ఈ కంపెనీ అతి తక్కువ కాలంలోనే ఎక్కువ ఉత్పత్తులు అందించి టాప్ లెవల్లో దూసుకుపోతుంది. కియా కంపెనీ ఇండియాలో ప్రారంభమై త్వరలో 5 ఏళ్లు పూర్తి చేసుకోబోతుంది. ఈ కాలంలో ఈ కంపెనీ నుంచి ఎన్ని కార్లు సేల్స్ అయ్యాయో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఆ వివరాల్లోకి వెళితే.. కియా కంపెనీ ఇండియాలో 2017లో అడుగుపెట్టింది. ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలో నెలకొన్న ప్లాంట్ ద్వారా కియా కార్లు ఉత్పత్తి ని 2019 నుంచి ప్రారంభించారు. ముందుగా ఈ కంపెనీ సెల్టోస్ ను మార్కెట్ లోకి తీసుకొచ్చారు. ఆ తరువాత పలు మోడళ్ల ను ఉత్పత్తి చేశారు. అయితే కియా కార్లు ఉత్పత్తి ప్రారంభించిన రెండేళ్ల నాటికి అంటే 2020-21 ఆర్థిక సంవత్సరానికి లాభాల బాటలో కొనసాగింది. ప్రస్తుతం ఈ కంపెనీ ప్రపంచం మొత్తం ఆదాయంలో 5 శాతం భారత్ ద్వారా పొందుతోంది. 2020 నాటికి ఈ కంపెనీ మొత్తం 3 లక్షల వాహనాలను మార్కెట్లో విక్రయించింది. కియా కంపెనీ ప్రారంభమై త్వరలో 5 ఏళ్లు పూర్తి చేసుకోబోతోంది. ఈ సందర్భంగా కియాకు సంబంధించిన వివరాలను బయటపెట్టబోతుంది. కానీ ప్రాథమికంగా అందుతున్న సమాచారం ప్రకారం ఈ కంపెనీ ఇప్పటి వరకు 10 లక్షల వాహనాలు విక్రయించినట్లు తెలుస్తోంది. ఇది రికార్డు అమ్మకాలే అని చెప్పవచ్చు. ఎందుకంటే కంపెనీ ప్రారంభమైన 5 ఏళ్లలో 10 లక్షల మైలు రాయి దాటడం మామూలు విషయం కాదని కొందరు కొనియాడుతున్నారు. మార్కెట్లో ఎక్కువగా ఆదరణ ఉన్న మారుతి, టాటా, హ్యుందాయ్ కంపెనీలకు కియా కార్లు గట్టి పోటీ ఇస్తున్నాయి.




## ఆల్‌టైమ్ హైకి నిఫ్టీ.. స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. ట్రేడింగ్‌లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ తొలిసారిగా గరిష్ఠానికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య బెంచ్ మార్క్ సూచీలు ఉదయం ఫ్లాట్‌గా మొదలయ్యాయి. ఆ తర్వాత సూచీలు కోలుకొని లాభాల్లో పయనించాయి. ఆ తర్వాత సూచీలు అమ్మకాల ఒత్తిడికి గురవడంతో చివరలో స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకున్నాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,779.84 పాయింట్ల వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 82,039.26 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. కనిష్ఠంగా 81,578.32కి తగ్గింది. చివరకు 73.80 పాయింట్ల లాభంతో 81,785.56 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25,030.80 పాయింట్ల వద్ద మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే 25,129.60 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 34.60 పాయింట్లు పెరిగి.. 25,052.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా స్టాక్స్ రాణించాయి. నిఫ్టీలో ఎల్‌టీఐఎండ్‌ట్రీ, విప్రో, దివిస్ ల్యాబ్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బ్రిటానియా ఇండస్ట్రీస్ నష్టపోయాయి. సెక్టార్లలో, ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్ ఒక్కొక్కటి ఒకశాతం కంటే ఎక్కువ పెరిగాయి. టెలికాం ఇండెక్స్ 0.5 శాతం, మీడియా ఇండెక్స్ 1.4 శాతం, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ 0.4 శాతం చొప్పున పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌తో సహా విస్తృత సూచీలు రికార్డు స్థాయిని తాకినప్పటికీ చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి.

## అవెస్థాజెన్‌తో అపోలో ఆయుర్వైద్ భాగస్వామ్యం




మధుమేహం, బరువు నియంత్రణ, హృదయ సంబంధిత వ్యాధులు, జీవక్రియ రుగ్మతల వంటి వాటితో బాధపడుతున్న వారికి ఔషధ పరమైన ఆహారం, డైటరీ సప్లిమెంట్లను అందించేందుకు లైఫ్ సైన్సెస్ కంపెనీ అవెస్థాజెన్ లిమిటెడ్‌తో..అపోలో హాస్పిటల్స్ గ్రూపునకు చెందిన కేరళ ఫస్ట్ హెల్త్ సర్వీసెస్ అనుబంధ సంస్థ అపోలో ఆయుర్వైద్ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇందులో భాగంగా అవెస్తాఆయుర్వైద్ బ్రాండు పేరుతో ఉత్పత్తులను అందుబాటులోకి తేనున్నాయి. ఆయుర్వేద సూత్రాలకు అనుగుణంగా ఈ ఆహార ఉత్పత్తులను తీసుకురానున్నట్లు ఇరు సంస్థలూ ప్రకటించాయి. ఆహార సంరక్షణ విభాగంలో అవెస్థాజెన్, అపోలో ఆయుర్వైద్ తమ అనుభవాన్ని ఇందుకోసం వినియోగించుకుంటాయి. అత్యాధునిక శాస్త్రీయ ధ్రువీకరణతో ఆయుర్వేద జ్ఞానాన్ని ఉపయోగించి ఆహార ఉత్పత్తులను తీసుకురావడానికి ఈ వ్యూహాత్మక ఒప్పదం తోడ్పడుతుందని అపోలో హాస్పిటల్స్ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతా రెడ్డి తెలిపారు. శాస్త్రీయంగా ధ్రువీకరించిన వైద్య ఆహారాలు, పథ్య సంబంధ సప్లిమెంట్ల శ్రేణిని అభివృద్ధి చేయడం ద్వారా రోగులకు ప్రత్యేక పోషకాహార అవసరాలను తీర్చడమే కాకుండా, సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు అపోలో ఆయుర్వైద్ ఛైర్‌పర్సన్ ప్రీతా రెడ్డి వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం.. అవెస్థాజెన్ అనుబంధ సంస్థలు ఉత్పత్తులను తయారు చేస్తాయి. అపోలో ఆయుర్వైద్ ఈ ఉత్పత్తులను విక్రయించే బాధ్యతలను నిర్వహిస్తుంది.

## రిలయన్స్- డిస్నీ డీల్‌కు సిసిఐ ఆమోదం




రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీ ఇండియా మధ్య కుదిరిన మీడియా వ్యాపార విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆమోదం తెలిపింది. ఈ సంస్థల విలీనం వల్ల ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో పోటీపరంగా ఇబ్బందులు తలెత్తొచ్చని సిసిఐ ఆందోళన వ్యక్తం చేసినట్లు రిపోర్టులు వచ్చిన కొద్ది రోజులకే ఆమోదం లభించడం గమనార్హం. స్వల్ప మార్పులతో ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపినట్లు సిసిఐ ఎక్స్‌లో వెల్లడించింది. "రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, వయాకామ్ మీడియా, డిజిటల్ 18 మీడియా లిమిటెడ్, స్టార్ ఇండియా, స్టార్ టెలివిజన్ ప్రొడక్షన్స్ వంటి సంస్థలకు సంబంధిత ప్రతిపాదిత విలీన ప్రక్రియ స్వచ్ఛంద సవరణకు లోబడి ఆమోదం పొందింది." అని సిసిఐ తెలిపింది. గత ఆరు నెలల క్రితం రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన వయాకామ్, వాల్ట్ డిస్నీ కంపెనీకి చెందిన స్టార్ ఇండియాల మధ్య రూ.71వేల కోట్ల (దాదాపు 8.5 బిలియన్ డాలర్లు) ఒప్పందం జరిగింది. విలీన అనంతర సంస్థలో రిలయన్స్‌కు 63.16 శాతం వాటా, వాల్ట్ డిస్నీకి 36.84 శాతం ఉండనుంది.

## ఐవోసీ తాత్కాలిక చైర్మన్‌గా సతీశ్




ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లకు కేంద్ర ప్రభుత్వం బుధవారం తాత్కాలిక చైర్మన్‌లను ప్రకటించింది. ఈ సంస్థలకు పూర్తిస్థాయిలో చైర్మన్లను నియమించే ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలోనే కేంద్రం ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నది. కాగా, ఐవోసీ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సతీశ్ కుమార్ వడుగూరిని ఆ సంస్థ తాత్కాలిక చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. అలాగే హెచ్‌పీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా ఉన్న రజ్నీశ్ నారంగ్‌ను ఆ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా నియమిస్తూ ఆర్డర్ ఇచ్చింది. సెప్టెంబర్ 1 నుంచి మూడు నెలలపాటు వీరిరువురు ఈ పదవుల్లో ఉండనున్నారు. ఈ నెలాఖరున ఐవోసీ చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య, హెచ్‌పీసీఎల్ చైర్మన్ పుష్ప కుమార్ జోషి పదవీ విరమణ పొందుతున్నారు. ఈ క్రమంలోనే వారి స్థానంలో సతీశ్, రజ్నీశ్‌లను తీసుకొస్తున్నారు.

తెలుగు దినపత్రిక
# పీపుల్స్ మోటివేషన్
People's Motivation
శుక్రవారం । ఆగస్టు । 30 । 2024



# కోహ్లీ టీం ఆఫర్ ఇస్తే వద్దన్నాడు..

దూకుడైన ఆటతీరు కనబరిచే వీరేంద్ర సెహ్వాగ్‌కు ఓ బౌలర్ తలనొప్పిగా మారాడు. అతడు మరెవరో కాదు.. ఆస్ట్రేలియా ఎడమచేతి ఫాస్ట్ బౌలర్ నాథన్ బ్రాకెన్. ఇతడి కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆర్సీబీ కోట్లు ఖర్చు చేసింది. కానీ లీగ్ ఆడేందుకు నిరాకరించాడు. ఐపీఎల్‌లో కోట్ల ఆఫర్ తిరస్కరించిన ఈ ప్లేయర్ ఇప్పుడు ఏం చేస్తున్నాడో తెల్సా.. 46 ఏళ్ల బ్రాకెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై దశాబ్దానికి పైగా గడిచింది. అతడు 2009లో ఆస్ట్రేలియా తరపున తన చివరి మ్యాచ్ ఆడాడు. ఆస్ట్రేలియా తరపున మూడు ఫార్మాట్లలో ఆడిన బ్రాకెన్.. 200కి పైగా వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అత్యధికంగా వన్డేల్లో 174 వికెట్లు పడగొట్టాడు. 2011లో మోకాలి గాయం కారణంగా క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నాథన్ బ్రాకెన్‌తో ఐపీఎల్‌లో ఆర్సీబీ టీం రూ. 1.3 కోట్లతో ఒప్పందం కుదుర్చుకోవాలనుకుంది. కానీ, ఈ లెఫ్టార్మ్ ఆస్ట్రేలియా బౌలర్ ఒప్పందాన్ని నిరాకరించాడు. ఐపీఎల్‌లో కోట్ల ఆఫర్‌ను తిరస్కరించిన ఈ బౌలర్.. ప్రస్తుతం సిడ్నీలోని ఒక కంపెనీలో అకౌంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మరోవైపు భారత్‌తో టెస్టుతో అరంగేట్రం చేసిన నాథన్ బ్రాకెన్.. సెహ్వాగ్‌ను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడు. నాథన్ బ్రాకెన్, వీరేంద్ర సెహ్వాగ్ అంతర్జాతీయ క్రికెట్‌లో 16 ఇన్నింగ్స్‌లలో ఒకరినొకరు ఎదుర్కొన్నారు. టెస్ట్, వన్డే, టీ20 కలిపి 16 ఇన్నింగ్స్‌లలో, సెహ్వాగ్‌కు 148 పరుగులు సమర్పించి.. అతడ్ని 7 సార్లు అవుట్ చేశాడు బ్రాకెన్.



## అల్కారజ్, సిన్నర్ శుభారంభం..



యూఎస్ ఓపెన్‌లో టాప్ సీడ్ ఆటగాళ్లు కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్), జన్నిక్ సిన్నర్ (ఇటలీ), డేనియల్ మెద్వెదెవ్ శుభారంభం చేశారు. పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ అల్కారజ్ 6-2, 4-6, 6-3, 6-1తో లి టు (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. తొలి సెట్‌ను అలవోకగానే గెలుచుకున్న అల్కారజ్ రెండో సెట్‌లో తడబడ్డా తర్వాత పుంజుకున్నాడు. ఈ విజయంతో అతడు గ్రాండ్‌స్లామ్ ఈవెంట్స్‌లో 60వ విజయం నమోదు చేసుకున్నాడు. ఇటీవల డోపింగ్ ఆరోపణలు ఎదుర్కుంటున్న ఒకటో సీడ్ సిన్నర్.. 2-6, 6-2, 6-1, 6-2తో మాకీ మెక్‌డొనాల్డ్ (యూఎస్ఏ)ను మట్టికరిపించాడు. రష్యన్ ఆటగాడు మెద్వెదెవ్ 6-3, 3-6, 6-3, 6-1తో దుసాన్ లెజొవిచ్ (సెర్బియా)ను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. 'గ్రీకు' వీరుడు స్టెఫనోస్ సిట్సిపస్ తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టాడు. రదుకాను ఔట్: మహిళల సింగిల్స్‌లో 2021 చాంపియన్ ఎమ్మా రదుకాను (బ్రిటన్) 1-6, 6-3, 4-6తో సోఫియా కెనిన్ (అమెరికా) చేతిలో ఓటమిపాలై తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మాజీ యూఎస్ చాంపియన్ నవోమి ఒసాకా 6-3, 6-2తో ఒస్టపెంకో(లాట్వియా)పై అలవోకగా గెలిచింది. మహిళల టెన్నిస్‌లో నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్) 6-4, 7-6 (8/6)తో కమిల్ల రఖిమోవా(రష్యా)పై నెగ్గింది. వీరితో పాటు వొజ్నియాకి (డెన్మార్క్), ఆండ్రీవా (రష్యా), జాస్మిన్ పలోని (ఇటలీ) రెండో రౌండ్‌కు అర్హత సాధించారు. యూఎస్ ఓపెన్ చరిత్రలో మంగళవారం అత్యంత సుదీర్ఘమైన మ్యాచ్ జరిగింది. కరెన్ కచనోవ్ (రష్యా), డాన్ ఎవాన్స్ (బ్రిటన్) మధ్య హోరాహోరీగా జరిగిన పోరు ఏకంగా 5 గంటల 35 నిమిషాల పాటు కొనసాగింది. టెన్నిస్ ఓపెన్ ఎరాలో భాగంగా 1970 నుంచి యూఎస్ ఓపెన్‌లో ఇంత సుదీర్ఘమైన మ్యాచ్ జరగడం ఇదే మొదటిసారి. గతంలో స్టీఫన్ ఎడ్‌బర్గ్, మైఖేల్ చాంగ్ మధ్య 1992లో జరిగిన సెమీస్ మ్యాచ్ 5 గంటల 26 నిమిషాల పాటు సాగగా తాజాగా ఆ రికార్డు బద్దలైంది. కాగా తాజా పోరులో ఎవాన్స్ 6-7 (6/8), 7-6 (7/2), 7-6 (7/4), 4-6, 6-4తో కరెన్‌ను ఓడించాడు. మూడు టై బ్రేకర్‌లు జరిగిన ఈ మ్యాచ్‌లో ఐదు సెట్లలో (68 నిమిషాలు, 67, 72, 67, 61) ఏ ఒక్క సెట్ కూడా గంట కంటే తక్కువ జరుగకపోవడం గమనార్హం.

## వరదల్లో చిక్కుకున్న స్టార్ స్పిన్నర్.. రక్షించిన ఎన్డీఆర్ఎఫ్




గుజరాత్‌లో భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరదలతో రాష్ట్రమంతా వణికిపోతోంది. వడోదరలో ఇప్పుడు వర్షం పడటం ఆగినా పరిస్థితులు మాత్రం దారుణంగానే ఉన్నాయి. విశ్వమిత్రి నదికి వరద పోటెత్తింది. ఈ వరదల్లో భారత మహిళా క్రికెటర్ రాధా యాదవ్ కుటుంబం చిక్కుకుపోయింది. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తమను రక్షించినట్లు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టు పెట్టింది. "రోడ్లన్నీ నీటితో మునిగిపోయాయి. మేమంతా అందులో చిక్కుకుపోయాం. మమ్మల్ని రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి ధన్యవాదాలు" అని రాధా యాదవ్ వెల్లడించింది. గుజరాత్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 28 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. నాలుగో రోజు కూడా రాష్ట్రమంతా వర్షాలు పడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 18వేల మంది నిరాశ్రయులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్‌లో సంభాషించారు. కేంద్రం నుంచి అవసరమైన సాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు.


## శ్రీజేష్ వారసుడిగా పాఠక్..



సుమారు రెండు దశాబ్దాల పాటు భారత హాకీ జట్టుకు గోల్ కీపర్‌గా సేవలందించి ఇటీవలే ఆటకు వీడ్కోలు పలికిన పీఆర్ శ్రీజేష్ స్థానాన్ని క్రిషన్ బహదూర్ పాఠక్ భర్తీ చేయనున్నాడు. సెప్టెంబర్ 8 నుంచి 17 దాకా చైనా వేదికగా జరుగబోయే ఆసియా చాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన 18 మంది జట్టు సభ్యులలో గోల్‌కీపర్‌గా పాఠక్ ఎంపికయ్యాడు. శ్రీజేష్ స్థానాన్ని పాఠక్.. ఏ మేరకు భర్తీ చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది. భారత హాకీ జట్టుతో 18 ఏండ్లుగా కొనసాగుతున్న దిగ్గజ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు చెప్పాడు. గోల్ పోస్ట్ వద్ద ప్రత్యర్థులు యత్నించిన గోల్స్‌ను పెట్టని గోడలా అడ్డుకుని జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన అతడు.. పారిస్ ఒలింపిక్స్ ముగిశాక ఆట నుంచి రిటైర్ కానున్నట్టు జూలై 23న ప్రకటించాడు. విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపాడు. 36 ఏండ్ల ఈ మాజీ సారథి 2006 నుంచి భారత జట్టుతో కొనసాగుతూ ఇప్పటిదాకా 328 మ్యాచ్‌లు ఆడాడు. 'పారిస్ ఒలింపిక్స్‌తో నా సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికేందుకు సిద్ధమయ్యా. ఈ అద్భుత ప్రయాణంలో నాకు అండగా నిలిచిన కుటుంబానికి, సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, హాకీ ఇండియాకు కృతజ్ఞతలు. పారిస్‌లో భారత్‌కు పతకం తెచ్చేందుకు మా అత్యుత్తమ ప్రదర్శనను చేస్తాం. పతకం రంగు మార్చడానికి ప్రయత్నిస్తాం' అని తెలిపాడు. 2004లోనే భారత జూనియర్ హాకీ జట్టులోకి వచ్చిన శ్రీజేష్.. 2006లో కొలంబో వేదికగా జరిగిన సౌత్‌ఏషియన్ గేమ్స్ సందర్భంగా సీనియర్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అయితే కెరీర్ తొలినాళ్లలో జట్టులోకి వస్తూ పోతూ సాగిన శ్రీజేష్ ప్రయాణం.. 2011 తర్వాత కొలిక్కివచ్చింది. అప్పట్నుంచి అతడు భారత జట్టులో రెగ్యులర్ గోల్‌కీపర్ అయ్యాడు. టీమ్‌ఇండియా సాధించిన పలు చారిత్రాత్మక విజయాలలో సభ్యుడిగా ఉన్న శ్రీజేష్.. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జట్టులోనూ సభ్యుడు. 41 ఏండ్ల తర్వాత హాకీలో కాంస్యం నెగ్గిన మ్యాచ్‌లో శ్రీజేష్.. జర్మనీ ఆటగాళ్లు కొట్టిన బంతులకు అడ్డుగోడగా నిలబడి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా శ్రీజేష్ రిటైర్మెంట్ నేపథ్యంలో పారిస్ ఒలింపిక్స్‌లో అతడి కోసం ఆడి పతకం సాధిస్తామని కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

## క్రెజికోవాకు షాక్

వింబుల్డన్ చాంపియన్ బార్బరా క్రెజికోవాకు రెండో రౌండ్‌లోనే చుక్కెదురైంది. యూఎస్ ఓపెన్‌లో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో 8వ సీడ్ క్రెజికోవా (చెక్) 4-6, 5-7తో ఎలెనా గాబ్రియెలా రూజ్ (రుమేనియా) చేతిలో పరాజయం పాలైంది. కాగా, 26వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్) 6-3, 7-5తో టౌన్‌సెండ్ (అమెరికా)పై, ఎలీస్ మెర్టిన్స్ 6-3, 6-2తో టామ్లజోవిచ్ (రుమేనియా)పై, నీమర్ (జర్మనీ) 6-4, 6-0తో యోయుకా (జపాన్)పై, మాడిసన్ కీస్ 6-4, 6-0తో మాయా జాయింట్‌పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరుకొన్నారు. మాజీ చాంపియన్ ఒసాక 6-3, 6-2తో ఓస్తపెంకోను చిత్తు చేసింది. రిబకినా 6-1, 7-6(1)తో అలావాను, పౌలెనీ 6-7(5), 6-2, 6-4తో ఆండ్రెస్క్యూను, పెగుల 6-4, 6-3తో రోజర్స్‌ను ఓడించారు. మూడో రౌండ్‌కు దిమిత్రోవ్..: పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో దిమిత్రోవ్ (బల్గేరియా) 6-1, 6-1, 7-6(4)తో హిజికటా (ఆస్ట్రేలియా)పై నెగ్గాడు. తొలి రౌండ్‌లో వరల్డ్ నెం:1 సిన్నర్ (ఇటలీ) 2-6, 6-2, 6-1, 6-2తో మెక్ డొనాల్డ్ (అమెరికా)పై, అల్కారజ్ (స్పెయిన్) 6-2, 4-6, 6-3, 6-1తో లి టు (ఆస్ట్రేలియా)పై, 5వ సీడ్ మెద్వెదెవ్ 6-3, 3-6, 6-3, 6-1తో లజోవిచ్‌పై, హర్కాజ్ 6-3, 7-6(4), 7-6(3)తో టిమోఫి స్కటోవ్‌పై గెలిచారు. కాగా, 5 గంటల 35 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో డాన్ ఇవాన్స్ (బ్రిటన్) 6-7(6), 7-6(2), 7-6(4), 4-6, 6-4తో కచనోవ్‌పై పోరాడి గెలిచాడు. 1970లో టైబ్రేక్ ప్రవేశపెట్టిన తర్వాత యూఎస్ ఓపెన్‌లో సుదీర్ఘంగా జరిగిన మ్యాచ్‌గా ఇది రికార్డులకెక్కింది. అయితే, సిట్సిపాస్ (గ్రీస్) 6-7(5), 6-4, 3-6, 5-7తో తనాసి (ఆస్ట్రేలియా) చేతిలో పరాజయం పాలయ్యాడు.




## ర్యాంకింగ్స్‌లో రోహిత్ పై పైకి..



అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి(ఐసిసి) విడుదల తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా బ్యాటర్లు సత్తా చాటారు. బ్యాటర్ల విభాగంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతోపాటు యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి టాప్-10లో చోటు దక్కించుకున్నారు. ఐసిసి బుధవారం టెస్ట్ ర్యాంకింగ్స్‌ను విడుదల చేయగా.. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 751 పాయింట్లతో ఆరోస్థానంలో నిలిచాడు. ఇక యువ సంచలనం యశస్వీ జైస్వాల్(740పాయింట్లు) ఏడో ర్యాంక్, సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లీ రెండుస్థానాలు మెరుగుపరుచుకొని 737పాయింట్లతో ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజామ్ 734పాయింట్లతో ఆరుస్థానాలు పడిపోయి 9వ ర్యాంక్‌లో నిలిచాడు. ఇంతకుముందు మూడోస్థానంలో ఉండగా.. తాజాగా తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టుల్లో విఫలంకావడంతో ర్యాంకుపై సైతం ప్రభావం పడింది. బంగ్లాతో సిరీస్‌లో రాణించిన మరో పాక్ బ్యాటర్ రిజ్వాన్ ఏడు స్థానాలు మెరుగుపరుచుకొని టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. ఇక ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ 881 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. న్యూజిలాండ్ ఆటగాళ్లు కేన్ విలియమన్, డారిల్ మిచెల్ రెండు, మూడోస్థానాల్లో నిలిచారు. శ్రీలంతో జరిగిన టెస్టులో అద్భుత ప్రదర్శన చేసిన యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్(758పాయింట్లు) ఏకంగా నాలుగో స్థానానికి ఎగబాకాడు.

## అంతర్జాతీయ క్రికెట్‌కు డేవిడ్ మలన్ గుడ్‌బై



ఇంగ్లండ్ క్రికెటర్ డేవిడ్ మలన్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుబ్‌బై చెప్పాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లో సీనియర్ ఆటగాడికి చోటు దక్కలేదు. ఈ క్రమంలోనే క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే, ఇంటర్నేషనల్ క్రికెట్‌కు గుడ్ బై చెప్పినా.. ఫ్రాంచైజీ క్రికెట్‌పై దృష్టి సారించనున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల ముగిసిన ది హండ్రెడ్ 2024 టైటిల్ గెలిచిన ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టులో డేవిడ్ మలన్ సభ్యుడిగా ఉన్నాడు. దక్షిణాఫ్రికా టీ20 క్రికెట్ లీగ్ ఎస్ఏ20లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు ఈ ఏడాది ట్రోఫీని సాధించడంలో మలన్ కీలకపాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టు తరఫున 2021 కేవలం ఒకే మ్యాచ్ ఆడాడు. 2017లో సౌతాఫ్రికాతో జరిగిన టీ20తో ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. టీ20ల్లో అద్భుత ప్రదర్శనతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్‌గా నిలిచాడు ఈ ఎడమచేతివాటం బ్యాటర్. 2022లో ఇంగ్లండ్ టీ20 ప్రపంచ కప్‌ను నెగ్గడంలో మలన్ కీలకపాత్ర పోషించాడు. ఇంగ్లండ్ తరఫున 62 టీ20లు ఆడిన మలన్.. 16 హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ నమోదు చేశాడు. 2022 టీ20 వరల్డ్‌కప్ తర్వాత మలన్ కేవలం 15 ఇన్నింగ్స్‌లలో ఐదు సెంచరీలతో వన్డే క్రికెట్‌లోనూ సత్తా చాటాడు. ఇంగ్లండ్ తరఫున 30 వన్డేలు, 22 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. 2023లో ప్రపంచకప్‌లో కనిపించాడు..

## బఫెట్ మరో ఘనత

బిలియనీర్ వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హాత్‌వే కంపెనీ రికార్డు సృష్టించింది. ఈ సంస్థ మార్కెట్ విలువ బుధవారం 1 ట్రిలియన్ డాలర్లను దాటేసింది. అమెరికాలో ఈ మార్క్‌ను ఇప్పటి వరకు కేవలం టెక్ జెయింట్‌లు మాత్రమే దాటాయి. తాజాగా తొలిసారి ఓ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. బుధవారం న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీలో దీని షేరు ధర 3.96 డాలర్లు పెరిగి.. 464.59 డాలర్లకు చేరింది. అమెరికాలో ఇప్పటికే ట్రిలియన్ డాలర్లు దాటిన కంపెనీల జాబితాలో యాపిల్, ఎన్‌విడియా, మైక్రోసాఫ్ట్, ఆల్ఫాబెట్, అమెజాన్, మెటా వంటి టెక్ దిగ్గజాలున్నాయి. ఈ ఏడాది బెర్క్‌షైర్ హాత్‌వేలో వేగంగా వృద్ధి చెందింది. 2024లోనే 30శాతానికి షేరు విలువ పెరిగింది. ప్రముఖ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ ఈ సంస్థను వృద్ధి చేయడంలో కొన్ని దశాబ్దాలు శ్రమించాడు. తొలుత వస్త్ర తయారీ పరిశ్రమగా మొదలైన ఈ సంస్థ ఆ తర్వాత మెల్లగా వివిధ రంగాల్లోకి అడుగుపెట్టింది. ఈ కంపెనీ 1965 నుంచి ఏటా 20 శాతం స్థిరంగా వృద్ధి సాధించింది. ఎస్అండ్‌పీ- 500 రాబడితో పోలిస్తే ఈ సంస్థది దాదాపు రెట్టింపు ఉంటుందని మార్కెట్ వర్గాలు నమ్ముతాయి. ఈ ఏడాది అమెరికా ఆర్థికవ్యవస్థ మెరుగ్గా ఉంటుందని అంచనాలు రావడతో బెర్క్‌షైర్ హాత్‌వే షేరు దూకుడుగా ఉంది. ఈ సంస్థ నగదు రిజర్వు రెండో త్రైమాసికానికి 276 బిలియన్ డాలర్లుగా నిలిచింది. ముఖ్యంగా యాపిల్‌లో స్టాక్‌ను విక్రయించడం ద్వారా ఈ ఏడాది భారీగా క్యాష్‌ను సమకూర్చుకొంది.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# రొటీన్‌కు భిన్నంగా సరిపోదా శనివారం

ఎప్పటికప్పుడు జోనర్లు మారుస్తూ సినిమాలు చేస్తున్న కథానాయకుడు నాని 'అంటే... సుందరానికి' తర్వాత నాని - వివేక్ ఆత్రేయ కలిసి చేసిన చిత్రమిది. తొలి సినిమాతో మిశ్రమ ఫలితాన్ని సొంతం చేసుకున్న ఈ కలయిక. ఈసారి ఎలాంటి ప్రభావం చూపించింది. 'సరిపోదా శనివారం' కథేంటంటే..: సూర్య (నాని)కి చిన్నప్పట్నుంచీ కోపం ఎక్కువ. ఆ కోపాన్ని అదుపులో పెట్టడం కోసం తను చనిపోతూ ఓ మాట తీసుకుంటుంది తల్లి ఛాయాదేవి (అభిరామి). అప్పట్నుంచి వారమంతా ఎంతగా కోపం వచ్చినా నియంత్రించుకుంటూ, శనివారం మాత్రమే తన కోపానికి కారణమైన వాళ్ల పని పడుతుంటాడు. వారమంతా చిత్రగుప్తుడులా చిట్టా రాసుకుంటూ, శనివారం యముడిలా చెలరేగిపోతాడన్న మాట. దాంతో ఆ గొడవలు ఇంటిదాకా వస్తుంటాయి. తండ్రి (సాయికుమార్), అక్క (అదితి) ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. ఎన్.ఎల్.ఐ.సిలో మంచి ఉద్యోగిగా పేరు తెచ్చుకున్న సూర్య చిట్టాలోకి సీఐ దయానంద్ (ఎస్.జె.సూర్య) చేరతాడు. తన సొంత అన్న కూర్మానంద్ (మురళీశర్మ)తోనే వైరం ఉన్న సీఐ దయానంద్ కథేమిటి?అతనికీ, సోకులపాలెం అనే ఊరికీ సంబంధమేంటి? దయానంద్‌పై సూర్యకు ఉన్న కోపం, సోకులపాలేనికి ఎలాంటి మేలు చేసింది? వీళ్ల కథలోకి చారులత (ప్రియాంక మోహన్) ఎలా ప్రవేశించింది? అన్నది చిత్ర కథ! వివేక్ ఆత్రేయ మార్క్ తెలివైన కథనంతో సాగే ఓ యాక్షన్ డ్రామా ఇది. విడుదలకు ముందు చిత్రబృందం కూడా కథ కంటే, ఆ కథని ఎలా చెప్పామన్నదే కీలకం అంటూ ప్రచారం చేసింది. అందుకు తగ్గట్టే బలమైన పాత్రలు, సంఘర్షణకి వైవిధ్యమైన కథనాన్ని మేళవించి 'సరిగ్గా సరిపోయింది' అనిపించేలా చిత్రాన్ని మలిచే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ఏ కథ అయినా అమ్మ నుంచే మొదలవుతుందంటూ అమ్మ, ఆమె తన కొడుకు నుంచి తీసుకున్న మాటతోనే సినిమా ప్రారంభమవుతుంది. ఆ ఎపిసోడ్‌తోనే సినిమాకి ఈ పేరు ఎందుకో స్పష్టమవుతుంది. కథ, పాత్రల పరిచయంతో కూడిన ఆరంభ సన్నివేశాలు కాస్త నెమ్మదిగా అనిపించినా, దయా పాత్ర ప్రవేశంతో అసలు కథ ఊపందుకుంటుంది. సోకులపాలెంని ఓ వస్తువులా చూస్తూ, తన కోపాన్ని ఆ ఊరిపై చూపించే ఇన్‌స్పెక్టర్ దయ, అతనికి అన్నతో ఉన్న వైరం చిత్రంలో కీలకం. ఆరంభం, మలుపు, పీటముడి, మధ్యభాగం, ముగింపు అంటూ పార్శ్వాలుగా కథని చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు. మలుపు అంకం నుంచి సన్నివేశాలు ఆసక్తికరంగా సాగిపోతుంటాయి. ఆ క్రమంలోనే పరిచయమయ్యే చారులత, కూర్మానంద్ పాత్రలు... వాటి ద్వారానే అన్నదమ్ముల మధ్య సంఘర్షణ, సోకులపాలెం కథలు వెలుగులోకి వచ్చే క్రమం ప్రేక్షకుడిని సినిమాలో లీనం చేస్తాయి. సూర్య, చారులత ప్రేమకథలో వచ్చే ఈగ స్టోరీ నవ్విస్తుంది. సినిమాలో కీలకమైన ప్రతి పాత్ర వెనకా ఓ కథ ఉంటుంది. ఆ కథల్ని వివరించే క్రమంలో కొన్ని సన్నివేశాలు నెమ్మదిగా సాగుతున్న భావన కలిగినా, పీటముడి, మధ్యభాగం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లాయి. సూర్య, చారులత దగ్గరయ్యే సన్నివేశాలు... చారులతకి సూర్య తన శనివారం సంగతిని చెప్పాలనుకోవడం, ఆ క్రమంలోనే వచ్చే యాక్షన్ ఎపిసోడ్, విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై మరిన్ని అంచనాల్ని పెంచాయి. అప్పటి నుంచి కథ సూర్య వర్సెస్ దయా అన్నట్టుగా మారిపోతుంది. సోకులపాలెంలో ధైర్యం నింపడం కోసం సూర్య, చారు కలిసి ఓ వ్యూహాన్ని రచించడం, ఆ క్రమంలో అనూహ్యంగా చోటు చేసుకునే సంఘటనలు, సూర్య ఇంట్లో సాగే పోరాట ఘట్టాలు ఆకట్టుకుంటాయి. కోపం నలుగురిలో ధైర్యాన్ని నింపేలా ఉండాలంటూ పతాక సన్నివేశాల దిశగా సినిమా సాగుతుంది.  నాని  యాక్షన్ అవతారం ఆకట్టుకుంటుంది. సూర్య పాత్రలో ఒదిగిపోయాడు. ఉద్యోగిగా సహజ సిద్ధమైన లుక్, నటనతో ఒకవైపు అలరిస్తూనే, మరోవైపు కోపంతో రగిలిపోయే కోణాన్ని ప్రదర్శించాడు. ఎస్.జె.సూర్య పోషించిన ఇన్‌స్పెక్టర్ దయానంద్ పాత్ర సినిమాకి కీలకం. క్రూరత్వం ప్రదర్శిస్తూ, తన చూపులతోనే భయపెడుతూ విలనిజం ప్రదర్శించాడు. ఆ పాత్రకి సరైన ఎంపిక అని చాటి చెప్పారు. చారులత పాత్రలో ప్రియాంక మోహన్ అలరిస్తుంది. నా జడ్జిమెంట్ ఎప్పుడూ తప్పే అంటూ మురళీశర్మ  తెరపై కనిపించిన విధానం, ఆయన పాత్ర సినిమాకి మరో ఆకర్షణ. సాయికుమార్, అదితి బాలన్, అభిరామి, హర్షవర్ధన్, మైమ్ మధు, అజయ్ తదితరులు కీలకమైన పాత్రల్లో కనిపించి మెప్పిస్తారు.




# రాజమౌళితో సినిమా చేయాలనుంది

**నటుడు విక్రమ్ వెల్లడి**

విక్రమ్ తాజా సినిమా 'తంగలాన్' విడుదలైన అన్ని ప్రాంతాల్లో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమాను బాలీవుడ్‌లోనూ విడుదల చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన డబ్బింగ్ పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 6న 'తంగలాన్' బీటౌన్‌లో విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఒకే రకమైన పాత్రలంటే ఆసక్తి ఉండదు. ఒకవేళ నేను అలా చేస్తే నా అభిమానులు నిరాశ పడతారు. అలాంటి చిత్రాలు కమర్షియల్‌గా హిట్ అయినప్పటికీ ఒకేతరహా పాత్రలనే ఎందుకు ఎంచుకుంటున్నారని మీడియా కూడా నన్ను ప్రశ్నించే అవకాశం ఉంది. అది నా శైలికి భిన్నం. అందుకే ప్రతి సినిమాకు కొత్తరకంగా ప్రయత్నిస్తాను. ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది నటీనటులు మాత్రమే ఇలా భిన్నంగా ప్రయత్నిస్తుంటారు. నా సినిమా వస్తుందంటే నా అభిమానులు కొత్తదనాన్ని కోరుకుంటారు. నా చిత్రాలు 'అపరిచితుడు', 'పొన్నియిన్ సెల్వన్' హిందీలో మంచి విజయాన్ని సాధించాయి. త్వరలో హిందీలో విడుదల కానున్న 'తంగలాన్'ను కూడా అదేస్థాయిలో ఆదరిస్తారని ఆశిస్తున్నా. నా అభిరుచికి సరిపోయే పాత్రలు వస్తే హిందీ చిత్రాలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. అలాంటి స్క్రిప్ట్‌తో ఎవరైనా సంప్రదిస్తే ఆనందంగా అంగీకరిస్తాను. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్నియిన్ సెల్వన్ భారీ ప్రేక్షకాదరణను సొంతం చేసుకోవడమే కాకుండా 4 జాతీయ అవార్డులను గెలుచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నాకు కూడా అవార్డు వచ్చిఉంటే ఇంకా సంతోషించేవాడిని. ఆ చిత్రం చరిత్రలో నిలిచిపోతుంది. మణిరత్నం దాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. రాజమౌళితో సినిమా గురించి చర్చలు జరిపిన విషయం వాస్తవమే. ఆయనతో సినిమా చేస్తాను. కానీ, దానికి సమయం పడుతుంది. భారతదేశంలోని అత్యంత గొప్ప దర్శకుల్లో రాజమౌళి ఒకరు. మేము సరైన స్క్రిప్ట్ కోసం ఎదరుచూస్తున్నాం. నేను ఇప్పటివరకు చేసిన చిత్రాల్లో 'కోబ్రా' అత్యంత కష్టమైనది. కానీ, అది అనుకున్నస్థాయిలో ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేదు. ఒక నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. కొన్నిసార్లు సినిమాకు ప్రశంసలు వస్తాయి. కానీ, కలెక్షన్లు రావు. కోబ్రాలో నేను చేసిన ఎన్నో సన్నివేశాలు సవాలుగా అనిపించాయి.



# తమిళ పరిశ్రమలో వేధింపులు ఉంటే చెప్పండి

**చర్యలు తీసుకుంటామన్న నటుడు విశాల్**

మలయాళ సినీరంగంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, లైంగిక వేధింపుల పై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదిక అక్కడి ఇండస్ట్రీని కుదిపివేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమ్మ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్‌లాల్‌పాటు మొత్తం 17 మంది పాలక మండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. కమిటీలోని కొంతమంది సభ్యులపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో వారందరూ రాజీనామా చేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో కోలీవుడ్ నటుడు విశాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాలీవుడ్‌లో హేమ కమిటీ తరహాలలో కోలీవుడ్‌లో 10 మందితో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తాం. తమిళ చిత్ర పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ ఉన్నట్టు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. కేరళలో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాగే తమిళనాడు నడిగర్ సంఘం ఆధ్వర్యంలో కమిటీ పెడతాం. నటీమణులు ఏవైనా సమస్యలు ఉంటే మాకు ఫిర్యాదు చేయండి. విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని విశాల్ స్పష్టం చేశాడు. కేరళలో మహిళలను వేధించిన వారికి శిక్ష పడాల్సిందే. మహిళలకు అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రతీ మగవారిపై ఉంటుందని సూచించాడు. మాలీవుడ్‌లో మహిళల లైంగిక వేధింపులతోపాటు పారితోషికాల్లో వివక్ష, షూటింగ్ లొకేషన్లలో కనీన సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హేమ కమిటీ నివేదికలో పేర్కొంది.



Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com